# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 24, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) ఆదివారం - 13 - ఏప్రిల్ - 2025


## వనజీవి రామయ్య మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందన



గుండెపోటుతో కన్నుమూసిన వనజీవి రామయ్య

ఈ ఉదయం తుదిశ్వాస విడిచిన పర్యావరణ ప్రేమికుడు

2లో

## అధికారం పోతే కొన్ని పార్టీలు తట్టుకోలేకపోతున్నాయి



జమిలి ఎన్నికలపై వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు

జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది ఉండదు

ఎన్నికల ఖర్చు కూడా ఆదా అవుతుంది

2లో

## దేశంలో ఉగ్రదాడులు జరగొచ్చు.. నిఘా సంస్థల హెచ్చరిక!

పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగొచ్చని హెచ్చరించాయి




డ్రోన్, ఐఈడీతో దాడులు జరగవచ్చని వెల్లడి

నదీమార్గాల్లో తీవ్రవాదులు చొరబడవచ్చు

## కేటీఆర్ కు డీకే అరుణ సవాల్




- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో ఓ బీజేపీ ఎంపీకి సంబంధం ఉందన్న కేటీఆర్
- దమ్ముంటే ఆ ఎంపీ పేరు చెప్పాలని కేటీఆర్ కు డీకే అరుణ సవాల్
- రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ ఒకటేనని విమర్శ

2లో

## విదేశీ కంపెనీలకు ఆహ్వానం

నూతన, వర్ధమాన రంగాలలో ఇందుకు పలు అవకాశాలు

ఆర్థిక పురోభివృద్ధి, సులభతర బిజినెస్ నిర్వహణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో దేశం వేగంగా ముందుకెళుతుంది



ఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారత్‌లో ఇన్వెస్ట్ చేయమంటూ ఆస్ట్రియన్ కంపెనీలకు తాజాగా ఆహ్వానం పలికారు. నూతన, వర్ధమాన రంగాలలో ఇందుకు పలు అవకాశాలున్నట్లు పేర్కొ న్నారు. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఏర్పాటైన ఇండియా-ఆస్ట్రియా బిజినెస్ రౌండ్‌టేబుల్ సందర్భంగా భారత్‌లో పెట్టుబడి అవకాశాలను వినియోగించుకోవలసిందిగా మిగతా..2లో


## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీలు సత్తా చాటాయి

### ఇంటర్ ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

ఫస్టియర్ లో 70 శాతం ఉత్తీర్ణత

సెకండియర్ లో 83 శాతం ఉత్తీర్ణత

ప్రభుత్వ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయన్న సీఎం చంద్రబాబు



అమరావతి: ఏపీలో ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతో నిరాడంబరంగా, చెప్పిన సమయానికే ఇంటర్ ఫలితాలను వెలువరించారు. ఫస్టియర్ విద్యార్థుల్లో 70 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, సెకండియర్ విద్యార్థుల్లో 83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఈసారి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులందరికీ హార్దిక శుభాభినందనలు తెలుపుతున్నానని వెల్లడించారు. "ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ఫస్టియర్ లో 47 శాతం, సెకండియర్ లో 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఫస్టియర్ లో 11 శాతం, సెకండియర్ లో 9 శాతం పెరుగుదల నమోదైంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, కేంద్రీకృత మూల్యాంకనం, పర్యవేక్షణ, నూతన సమయపాలన, 100 రోజుల సక్సెస్ కార్యక్రమం, తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులు, సంరక్షకుల వ్యవస్థ... ఇలా విద్యా రంగంలో మేము ప్రవేశపెట్టిన సంస్కరణలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయి" అని చంద్రబాబు వివరించారు.

## డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను గౌరవించింది బీజేపీ మాత్రమే!

అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్‌లో ఆయన చిత్రపటం పెట్టాం

60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదు

ప్రధాని నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టుకుని చేసినవే



అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గౌరవించింది భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మాత్రమే అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్‌లో ఆయన చిత్రపటం పెట్టాం అని, 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. 106 సార్లు సవరణ జరిగిన రాజ్యాంగంలో అధిక శాతం కాంగ్రెస్ స్వలాభం కోసం సవరణలు జరిగాయని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టుకుని చేసినవే అని పురంధేశ్వరి పేర్కొన్నారు. మిగతా..2లో



2లో

## పశ్చిమబెంగాల్‌లో నిరసన సెగ.. సీఎం మమతా విన్నపం ఇదే!

- ఎవరూ కూడా రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులకు చోటివ్వకండి
- ఇక్కడ ఏమైనా జరిగితే ఓవరాల్ గా నష్టపోయేది ప్రజలే
- అది ఏ వర్గమైనా, ఏ కులమైనా, ఏ మతమైనా ప్రజలే ఇబ్బంది పడతారు

## ఐసీఐసీఐ బ్యాంకు ప్రకటన... రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం



కంచ గచ్చిబౌలి భూములను తనఖా పెట్టినట్లు ప్రభుత్వం చెప్పిందన్న హరీశ్ రావు

కానీ తనఖా పెట్టుకోలేదని ఐసీఐసీఐ ప్రకటన విడుదల చేసిందని వెల్లడి



2లో


## 6 వేల మందిని రికార్డుల్లో చంపేసిన ట్రంప్ సర్కారు..!

- తాత్కాలిక పర్మిట్ తో అమెరికాలోకి వచ్చి తిరిగి వెళ్లకపోవడంతో నిర్ణయం
- పొమ్మన లేక కాదు వలసదారులను పొమ్మనే పొగబెట్టిన ట్రంప్
- రికార్డుల్లో మరణించినట్లు నమోదు.. సోషల్ సెక్యూరిటీ నెంబర్ రద్దు
- తమకు తాముగా అమెరికా విడిచి వెళ్లేలా చేయడమే ట్రంప్ ఉద్దేశం

## రాష్ట్రపతికి డెడ్ లైన్ విధించిన సుప్రీంకోర్టు...!

### రాష్ట్రపతికి బిల్లులపై నిర్ణయానికి 3 నెలల గడువు

- గడువు దాటితే కారణాలు చెప్పాలన్న సుప్రీంకోర్టు.
- రాష్ట్రపతి తిరస్కరిస్తే కోర్టును ఆశ్రయించవచ్చని ప్రభుత్వాలకు సూచన
- మంత్రి మండలి సలహా మేరకే గవర్నర్ల నిర్ణయాలు ఉండాలని స్పష్టీకరణ
- తమిళనాడు ప్రభుత్వ పిటిషన్ పై విచారణలో సుప్రం కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: ఇకపై బిల్లుల ఆమోదంలో జాప్యానికి తావుండరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులను గవర్నర్‌లు నిర్ణీత సమయంలో ఆమోదించాల్సిందేనని ఉద్ఘాటించింది. లేదంటే వారి చర్యలను న్యాయ సమీక్షకు గురిచేస్తామని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన బిల్లులను కూడా మూడు నెలల్లోపు పరిష్కరించాలని ఆదేశించింది. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచిన 10 బిల్లులను సుప్రీంకోర్టు క్లియర్ చేసిన నాలుగు రోజుల తర్వాత ఈ తీర్పు వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు ఉన్న అధికారాలను మిగతా..2లో

## త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ?

- విభజన సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై చర్చలు జరపనున్నట్లు సమాచారం
- ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టాక 2024 జులైలో తొలిసారి ఇరువురూ భేటీ
- ప్రజాభవన్ లో జరిగిన ఈ సమావేశంలో విభజన సమస్యలపై చర్చలు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సమావేశం కానున్నారని తెలుస్తోంది. విభజన సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై మిగతా..2లో



2లో

## పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మకంగా మారిన 'వక్ఫ్' ఆందోళన


- ముర్షిదాబాద్‌లో ఆందోళనకారుల నిరసన
- నిమ్టిటా స్టేషన్‌లో ఆగివున్న రైలుపై రాళ్లదాడి
- పదిమంది పోలీసులు, ప్రయాణికులకు గాయాలు

## భూభారతి పోర్టల్ ప్రారంభంపె రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..?

పకడ్బందీగా భూభారతి చట్టాన్ని అమలు చేయాలి

ఈనెల 14న హైదరాబాద్ లోని శిల్పకళా వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా నూతన రెవెన్యూ చట్టం, పోర్టల్ ను ఆవిష్కరించేందుకు రెవెన్యూ శాఖ ఏర్పాట్లు

కొత్త చట్టం అమలు, నియమ, నిబంధనలపై అదేరోజు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం




హైదరాబాద్: ధరణి పోర్టల్ లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీగా భూభారతి చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్ పోర్టల్ ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్ మిగతా..2లో




## చంద్రుడిపై మానవ వ్యర్థాలు..

- మంచి ఐడియా ఇస్తే రూ.25 కోట్ల ప్రైజ్ మనీ: నాసా ఆఫర్
- చైనాతో చేతులు కలిపిన జుకర్‌బర్గ్.. వేగు సంచలన ఆరోపణలు
- వ్యర్థాలను నీరు, శక్తి, ఎరువుగా మార్చేందుకు ఐడియాలు ఇవ్వాలంటూ ఆహ్వానం

2లో

## సన్నబియ్యం పంపిణీకి స్పందన అద్భుతం

10 ఏళ్ల బీఆర్ఎస్ హయాంలో పండని పంట కాంగ్రెస్ హయాంలో పడింది

గతంలో 2.8కోట్ల జనాభాకు దొడ్డు బియ్యం ఇచ్చేందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేశారు

3.10కోట్ల మందికి సన్నబియ్యం ఇవ్వడానికి రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం



హైదరాబాద్: సన్నబియ్యం పంపిణీకి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో 2.8కోట్ల జనాభాకు దొడ్డు బియ్యం ఇచ్చేందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేశారని, తాము 3.10కోట్ల మందికి మిగతా..2లో

శుభోదయం



# వనజీవి రామయ్య మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందన

ఢిల్లీ: ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు వనజీవి రామయ్య ఈ ఉదయం గుండెపోటుతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. మొక్కలు నాటడమే పరమావధిగా భావించిన రామయ్య మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. దరిపల్లి రామయ్య గారు సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా గుర్తుండిపోతారని కీర్తించారు. లక్షలాది చెట్లను నాటడానికి, వాటిని రక్షించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం ఇచ్చారని కొనియాడారు. "రామయ్య అవిశ్రాంత కృషి ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమనూ, భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయి. ఆయన చేసిన కృషి మన యువతలో మరింత సుస్థిరమైన హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుంది. ఈ విషాద సమయంలో రామయ్య కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను... ఓం శాంతి" అంటూ మోదీ తన సంతాప సందేశం వెలువరించారు.

## అధికారం పోతే కొన్ని పార్టీలు తట్టుకోలేకపోతున్నాయి

హైదరాబాద్: జమిలి ఎన్నికల వైపు కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జమిలి ఎన్నికలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ అంశంపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ జమిలీ ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది అనేది కేవలం అపోహ మాత్రమేనని చెప్పారు. ఒకే దేశం - ఒకే ఎన్నికపై తిరుపతిలో మేధావుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రసంగిస్తూ వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. జమిలి ఎన్నికల ద్వారా ఎన్నికల ఖర్చు ఆదా అవుతుందని వెంకయ్యనాయుడు చెప్పారు. ఈ ఎన్నికలను కొన్ని పార్టీలు వ్యతిరేకించడంలో రాజకీయ కోణం తప్ప మరేమీ లేదని అన్నారు. అధికారం పోతే కొన్ని పార్టీలు తట్టుకోలేక పోతున్నాయని చెప్పారు. పార్టీ ఫిరాయించడం ప్రజాస్వామ్యానికి చేటు అని అన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి జంప్ కావడం సరికాదని వ్యాఖ్యానించారు.

## దేశంలో ఉగ్రదాడులు జరగొచ్చు..
# నిఘా సంస్థల హెచ్చరిక!

ఇంటర్నెట్‌డెస్క్: దేశంలో ఉగ్రదాడులు జరగవచ్చని నిఘా సంస్థలు హెచ్చరికలు చేశాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగొచ్చని హెచ్చరించాయి. ఈ క్రమంలో రైల్వేశాఖను అప్రమత్తం చేశాయి. డ్రోన్, ఐఈడీతో దాడులు జరగవచ్చని వెల్లడించాయి. నదీమార్గాల్లో తీవ్రవాదులు చొరబడవచ్చని చెప్పాయి. ముంబయి ఉగ్రదాడి కీలక కుట్రదారు తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న తరుణంలో ఈ అలర్ట్ రావడం గమనార్హం. 2008 నవంబర్ 26న 10మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా ముంబయికి చేరుకొని.. సీఎస్ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు మారణహోమం కొనసాగింది. ఈ ఘటనల్లో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు. అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరులయ్యారు. రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి.

## పశ్చిమబెంగాల్‌లో నిరసన సెగ..
# సీఎం మమతా విన్నపం ఇదే!

కోల్ కతా: వక్ఫ్ సవరణ చట్టం ఇప్పటికే అమల్లోకి వచ్చిన తరుణంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నిరసన జ్వాలలు రాజుకున్నాయి. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిరసన ?కార్యక్రమం చేపట్టారు. ప్రధానంగా రాష్ట్రంలో ముర్షిబాద్ తో పాటు పల్ల జిల్లాల్లో వరుసగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో శనివారం అది ఇంకా తీవ్ర రూపం దాల్చింది. ఈ నేపథ్యంలో వంద మందిని అరెస్టు చేశారు. దీనిపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ' ప్రజలకు ఇదే నా విజ్ఞప్తి. రాష్ట్రంలోని అన్ని మతాలకు ప్రజలకు నేను ఒకటే విన్నపం చేస్తున్నా. ఎవరూ కూడా రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులకు చోటివ్వకండి. ఇక్కడ ఏమైనా జరిగితే ఓవరాల్ గా నష్టపోయేది ప్రజలే. అది ఏ వర్గమైనా, ఏ కులమైనా, ఏ మతమైనా ప్రజలే ఇబ్బంది పడతారు. మీ నిరసనను హింసాత్మకంగా మారనివ్వకండి. ఎవరి జీవితమైనా ఒక్కటే. ప్రతీ మనిషి జీవితం చాలా ముఖ్యమైనదే విషయం మీరు గ్రహించండి. వక్ఫ్ సవరణ చట్టం అనేది రాష్ట్రంలో అమలు చేసే ప్రసక్తే లేదు. వక్ఫ్ సవరణ చట్టాన్ని చాలా మంది వ్యతిరేకిస్తున్న క్రమంలో దాన్ని మేము చట్టంగా గుర్తించడం లేదు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన చట్టం మాత్రమే. మనం దీనికి కేంద్రాన్నే అడుగుదాం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉంది. మనకు సమాధానం చెప్పాల్సింది కేంద్ర ప్రభుత్వమే. ఈ చట్టానికి మేము మద్దతు ఇవ్వడం లేదు. అదే సమయంలో ఇక్కడ అమలుకు కూడా నోచుకోదు. ఇది గుర్తుపెట్టుకుంది. అంతా నిరసనలు విరమించి శాంతించండి' అంటూ మమతా బెనర్జీ 'ఎక్స్( వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. కాగా, పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లు.. చట్ట రూపం దాల్చింది.ఏప్రిల్ 8వ తేదీ నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. దీనికి కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గత శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. మరోవైపు.. సుప్రీంకోర్టులో వక్ఫ్ బిల్లును సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి., ఈ క్రమంలో.. తమ వాదనలు వినాలంటూ కేంద్రం కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ క్రమంలో 15, 16వ తేదీల్లో దేశ సర్వోన్నత న్యాయస్థానంలో జరగబోయే విచారణపై ఉత్కంఠ నెలకొంది. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ సుమారు 16 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటితో పాటు కేంద్రం వేసిన కేవియట్‌ను కలిపి విచారించాలని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయించింది.

## 6 వేల మందిని రికార్డుల్లో చంపేసిన ట్రంప్ సర్కారు..!

అమెరికా: అమెరికాలో నివసిస్తున్న 6 వేల మంది వలసదారులను ట్రంప్ ప్రభుత్వం రికార్డుల్లో చంపేసింది. వారంతా జీవించి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం రికార్డుల్లో మరణించినట్లు అప్ డేట్ చేశారు. దీంతో వారి సోషల్ సెక్యూరిటీ నెంబర్ ఆటోమేటిక్ గా రద్దవుతుంది. అమెరికాలో సోషల్ సెక్యూరిటీ నెంబర్ అనేది తప్పనిసరి. అమెరికా పౌరులతో పాటు తాత్కాలికంగా ఆశ్రయం కోసం వచ్చిన వారికీ ప్రభుత్వం ఈ నెంబర్ ను కేటాయిస్తుంది. ఈ సోషల్ సెక్యూరిటీ నెంబర్ లేదంటే వారు జీవించి ఉన్నా కూడా మరణించినట్లే పరిగణించబడతారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందే అవకాశం వారికి ఉండదు. అంతేకాదు, ఉద్యోగం కానీ, ఏదైనా చిన్నపాటి పని కానీ చేసుకునే వీలు ఉండదు. వలసదారులు తమకు తామే అమెరికాను విడిచి వెళ్లిపోయేలా చేసేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పొమ్మన లేక పొగ బెట్టినట్లనేది తెలుగు సామెత కానీ ట్రంప్ సర్కారు మాత్రం పొమ్మనే పొగ పెట్టినట్లు ఇలా రికార్డుల్లో వలసదారులను చంపేసింది. బైడెన్ ప్రభుత్వం అమలు చేసిన పలు కార్యక్రమాల ద్వారా సుమారు 90 వేల మంది వలసదారులు అమెరికాలో అడుగుపెట్టారని అధికారులు తెలిపారు. వారందరూ తాత్కాలిక ఆశ్రయం కోరి వచ్చినవారేనని వివరించారు. అయితే, గడువు ముగిసినా వారు స్వదేశానికి తిరిగి వెళ్లలేదని, అమెరికాలోనే ఉంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారందరినీ వెతికి పట్టుకుని వెనక్కి పంపడం శ్రమతో కూడుకున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ రికార్డుల్లో వారు చనిపోయినట్లు నమోదు చేస్తే సోషల్ సెక్యూరిటీ నెంబర్ రద్దయి వారంతట వారే అమెరికాను వీడుతారని అధికారులు భావించారు. ఇందులో భాగంగానే తాజాగా 6 వేల మంది వలసదారులను రికార్డుల్లో మరణించినట్లుగా నమోదు చేశారు.

## పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మకంగా మారిన 'వక్ఫ్' ఆందోళన

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో 'వక్ఫ్' బిల్లుపై నిన్న జరిగిన ఆందోళన హింసాత్మకంగా మారింది. నిమ్టిటా స్టేషన్‌లో ఆగి ఉన్న రైలుపై ఆందోళనకారులు రాళ్లు విసిరారు. రైల్వే ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో 10 మంది పోలీసులు గాయపడ్డారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బీఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించాల్సి వచ్చింది. ఈ ఘటనతో రెండు రైళ్లను రద్దు చేశారు. మరో ఐదు రైళ్లను దారి మళ్లించారు. ఈ దాడిలో కొందరు ప్రయాణికులకు కూడా గాయాలయ్యాయి. మరోవైపు, ముర్షిదాబాద్‌లోనూ పోలీసులు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకారులు వాహనాలను తగలబెట్టి విధ్వంసం సృష్టించారు. ఈ హింసాత్మక ఘటనలపై గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ తీవ్రంగా స్పందించారు. హింసకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో మాట్లాడారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని పోలీసులు తెలిపారు. హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హింసాత్మక ఘటనలకు కారణమైన వారిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు దాడులు ప్రారంభించారు. ఈ నెల 16న ఇమాములతో కోల్‌కతాలో మమతా బెనర్జీ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆందోళనకారులు శాంతించాలని టీఎంసీ నేత కునాల్ ఘోష్ కోరారు. వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ మంగళవారం ముర్షిదాబాద్‌లో ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చారు. అప్పటి నుంచి ప్రతి రోజూ ఆందోళనలు కొనసాగుతుండగా నిన్న ఇవి హింసాత్మకంగా మారాయి.

# చంద్రుడిపై మానవ వ్యర్థాలు..

ఢిల్లీ: చంద్రుడిపై దాగిఉన్న పలు విషయాలను తెలుసుకునేందుకు చాలా దేశాలు ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. దాదాపు 50 సంవత్సరాలుగా అమెరికా అంతరిక్ష సంస్థ నాసా జాబిల్లిపై తమ వ్యోమగాములను పంపుతోంది. దీంతో అక్కడ మానవ వ్యర్థాలు కుప్పగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలోనే నాసా ఓ ఆఫర్‌ను ప్రకటించింది. వాటిని తొలగించేలా లేదా రీసైక్లింగ్ చేసేలా వినూత్న పరిష్కారం చెబితే 3 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.25 కోట్లు) నజరానా అందిస్తామని తెలిపింది. నాసా 1969 నుంచి 1972 మధ్యకాలంలో ఆపోలో మిషన్ ద్వారా వ్యోమగాములను చంద్రుడిపై పరిశోధనల కోసం పంపించింది. ఆరుసార్లు విజయవంతంగా మిషన్ల ల్యాండింగ్స్ జరిగాయి. వ్యోమగాములు పరిశోధన కోసం జాబిల్లి నుంచి కొంత నమూనా తీసుకువచ్చాయి. అయితే.. లూనార్ మాడ్యూల్‌లో నిల్వ ఉంచే స్థల పరిమితిని దృష్టిలో ఉంచుకున్న వ్యోమగాములు అనవసరమైన వస్తువులను బయటకు విసిరేసి వచ్చారని నాసా తాజాగా తెలిపింది. వీటిలో మానవ వ్యర్థాలే అధిక మొత్తంలో ఉన్నట్లు వెల్లడించింది. వీటిని చిన్నచిన్న బ్యాగుల్లో ఉంచి జాబిల్లిపై పడేసి వచ్చారని తెలిపింది. ఇలా మొత్తం 96 సంచుల వ్యర్థాలు చంద్రుడిపై ఉన్నాయి. వాటిని అక్కడినుంచి తొలగించాల్సిన అవసరాన్ని దృష్టిలోపెట్టుకున్న నాసా ఈ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. లూనార్ సైకిల్ ఛాలెంజ్ పేరిట దీన్ని ప్రారంభించింది. వ్యర్థాలను నీరు, శక్తి, ఎరువుగా మార్చేందుకు ఐడియాలు ఇవ్వాలంటూ ఆహ్వానం పలికింది. ఈ ఛాలెంజ్‌లో గెలిచిన వారికి 3 మిలియన్ డాలర్లు అందజేస్తామని ప్రకటించింది.

చైనాతో చేతులు కలిపిన జుకర్‌బర్గ్.. వేగు సంచలన ఆరోపణలు

చంద్రుడిపైనే కాక అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు తాము ఉపయోగించిన వస్తువులను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ వినియోగిస్తుంటారు. అక్కడ ఉండే మానవ సంబంధింత వ్యర్థాలను నిర్మూలించాలన్నా, తిరిగి భూమిపైకి తీసుకురావాలన్నా సవాళ్లతో కూడుకున్న అంశం. ఈ కోణంలోనూ ఆలోచించిన నాసా తాజాగా ప్రకటన చేసింది. భవిష్యత్తులో చందమామ పైకి మానవులను తీసుకెళ్లడం.. అక్కడ వారి జీవన విధానాన్ని మెరుగుపరచడంలో ఇప్పుడు ఇచ్చే ఐడియా ఎంతో కీలకమవ్వనున్నట్లు తెలుస్తోంది.

## భూభారతి పోర్టల్ ప్రారంభంపై
# రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..?

మొదటి పేజి తరువాయి




ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్ నూ ప్రభుత్వం అమల్లోకి తీసుకురానుంది. ఈనెల 14న హైదరాబాద్ లోని శిల్పకళా వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా నూతన రెవెన్యూ చట్టం, పోర్టల్ ను ఆవిష్కరించేందుకు రెవెన్యూ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. కొత్త చట్టం అమలు, నియమ, నిబంధనలపై అదేరోజు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. భూ సమస్యలపై సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా స్థాయి ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించడం, 33 మాడ్యుళ్లను ఆరుకు కుదించడం వంటివి కొత్త చట్టంలో కీలక అంశాలుగా నిలవనున్నాయి. పాతదానిలో 33 మాడ్యూళ్లు ఉన్నాయి. రైతులు పోర్టల్లో దరఖాస్తు చేసే సమయంలో ఒకదానికి బదులు మరొక మాడ్యూల్ ను ఎంపిక చేస్తే తిరస్కారానికి గురికావడమో, లేదంటే సమస్య పరిష్కారం కాకపోవడమో జరిగేది. దీంతో ఈ గందరగోళానికి ముగింపు పలికేలా భూ భారతి పోర్టల్ లో మాడ్యూళ్ల సంఖ్యను ఆరుకు కుదించారు. ధరణిలో కేవలం భూ యాజమాని పేరుతో మాత్రమే పహాణీ ఉండేది. ప్రస్తుతం భూ భారతి పోర్టల్ లో ఈ-పహాణీని 11 కాలమ్ లతో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వీటిలో భూ యాజమాని పేరుతో పాటు భూ ఖాతా, సర్వే నెంబర్, అనుభవదారు లేదా పట్టాదారు, ప్రభుత్వ భూమి లేదా పట్టా భూమి, వారసత్వంగా వచ్చిందా, కొనుగోలు ద్వారా వచ్చిందా తదితర వివరాలు తెలిపేలా పహాణీ ఉండనుంది. భూ భారతి పోర్టల్ లోగో ను కూడా రెవెన్యూ శాఖ సిద్ధంచేసినట్లు తెలుస్తోంది. వృత్తంలో తెలంగాణ అధికారిక చిహ్నాలు, లోపల సాగును ప్రతిబింబించేలా ఆకుపచ్చని రంగుతో లోగో ఉండనున్నట్లు సమాచారం. వృత్తంపై భూముల నిర్వహణకు సంబంధించిన చట్టం వివరాలను పొందుపర్చినట్లు తెలుస్తోంది. అయితే, కొత్త చట్టం, భూ భారతి లోగోను ఖరారు చేసేందుకు సీఎం రేవంత్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులు, నిపుణులు సమావేశమై చర్చించనున్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను
# గౌరవించింది బీజేపీ మాత్రమే!

మొదటి పేజి తరువాయి




ప్రధాని నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టుకుని చేసినవే అని పురంధేశ్వరి పేర్కొన్నారు. ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణపై రాష్ట్రస్థాయి కార్యాచరణ సమావేశానికి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరితో పాటు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హాజరయ్యారు. ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమసమాజ స్థాపనకు కృషి చేశారు. 2014 ఎన్నికల్లో విపక్షాలు మా పట్ల దుష్ప్రచారం చేశాయి. అంబేద్కర్‌ను గౌరవించింది బీజేపీ మాత్రమే. అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్‌లో ఆయన చిత్రపటం పెట్టాం. 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదు. 106 సార్లు సవరణ జరిగిన రాజ్యాంగంలో అధిక శాతం కాంగ్రెస్ స్వలాభం కోసం సవరణలు జరిగాయి. నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టుకుని చేసినవే. డీకే శివకుమార్ ముస్లిం మైనారిటీలకు 4% అదనపు రిజర్వేషన్ ఇవ్వడానికి రాజ్యాంగాన్ని మార్చేస్తాం అన్నారు. శివకుమార్‌కు రాజ్యాంగం పట్ల ఉన్న గౌరవం ఇదేనా.. మీకోసం మార్చేస్తారా?' అని మండిపడ్డారు. 'అంబేద్కర్ జయంతి వేడుకలు రేపటి నుంచి 25వ తేదీ వరకూ జరపాలని నిర్ణయం తీసుకున్నాం. అంబేద్కర్ ఆశయాలను గ్రామగ్రామాలకూ తీసుకెళ్ళాలని నిర్ణయించారు. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారనే కాంగ్రెస్ దుష్ప్రచారం వల్ల వచ్చిన అనుమానాలు లేకుండా చేయడానికే ఈ వేడుకలు. అంబేద్కర్‌ను ఓడించాలని నెహ్రూ అప్పట్లో ఆదేశించారు. అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ రాజ్యాంగానికి తూట్లు పొడిచింది. మోడీ దేశ అభువృద్ధి కోసం రాజ్యాంగ సవరణలు చేశారు. పార్టీ అధికారం కోసం ఏనాడూ బీజేపీ రాజ్యాంగ సవరణలు చేయలేదు. మోడీ నాయకత్వంలో దేశ అభివృద్ధి ధ్యేయంగా అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నది బీజేపీ. ఎన్డీఏ ప్రభుత్వ కృషిని గురించి ప్రజలకు తెలిసేలా చేయడం, అంబేద్కర్ స్ఫూర్తి తెలిపేలా చేయడం మా ధ్యేయం' అని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు.

# ఐసీఐసీఐ బ్యాంకు ప్రకటన...
## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి తీవ్రంగా విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో ప్రభుత్వం ఈ భూములను తనఖా పెట్టి రుణం పొందినట్లు చెప్పిందని, అయితే ఐసీఐసీఐ బ్యాంకు మాత్రం తాము తనఖా పెట్టుకోలేదని ప్రకటన విడుదల చేసిందని గుర్తు చేశారు. ఆ 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూములను ప్రభుత్వం ఎవరి వద్ద తనఖా పెట్టిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బ్రోకర్ కంపెనీలకు తనఖా పెట్టారా? 400 ఎకరాల తనఖా విషయంలో దాగి ఉన్న చీకటి కోణం ఏమిటి? అని హరీశ్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఐసీఐసీఐ ప్రకటన ఇదీ

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ)కి ఎటువంటి తనఖా రుణాన్ని అందించలేదని ఐసీఐసీఐ బ్యాంకు ఒక ప్రకటనను విడుదల చేసింది. బాండ్ల జారీకి సంబంధించి తమ వద్ద ఎలాంటి స్థలాన్ని తనఖా పెట్టలేదని కూడా తెలిపింది. బాండ్ల జారీ ద్వారా వచ్చే నిధుల స్వీకరణ, వడ్డీ చెల్లింపునకు సంబంధించి టీఎస్ఐఐసీకి అకౌంటు బ్యాంకుగా మాత్రమే వ్యవహరించామని పేర్కొంది.

# విదేశీ కంపెనీలకు ఆహ్వానం

మొదటి పేజి తరువాయి



భారత్‌లో పెట్టుబడి అవకాశాలను వినియోగించుకోవలసిందిగా సూచించారు. ఆర్థిక పురోభివృద్ధి, సులభతర బిజినెస్ నిర్వహణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో దేశం వేగంగా ముందుకెళుతున్నట్లు తెలియజేశారు. వర్ధమాన రంగాలలో పలు అవకాశాలు పుడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రీన్ హైడ్రోజెన్, ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్‌లను ప్రస్తావించారు. ఆసియా, దక్షిణ ప్రపంచానికి భారత్ అద్భుతమైన గేట్‌వేగా అభివర్ణించారు. ఇండియా-ఆస్ట్రియా ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్యం మరింత బలపడుతుందని, అత్యధిక అవకాశాలున్నాయని వ్యాఖ్యానించారు. భారత్‌లో విస్తరించిన తయారీ, సామర్థ్యాలను ప్రస్తావిస్తూ ఆస్ట్రియన్ కంపెనీలు కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. తద్వారా దేశీయంగా లభించే అత్యున్నత ఐటీ, డిజిటల్ నైపుణ్యాలను వినియోగించుకోవచ్చని చెప్పారు.

## రాష్ట్రపతికి డెడ్ లైన్ విధించిన సుప్రీంకోర్టు...!

మొదటి పేజి తరువాయి

ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు ఉన్న అధికారాలను గుర్తు చేస్తూనే, బిల్లులను ఆమోదించకుండా నిరవధికంగా నిలిపి ఉంచడాన్ని కోర్టు తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపితే, రాష్ట్రపతి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన గడువును అనుసరించాలని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆలస్యమైతే, అందుకు గల కారణాలను సంబంధిత రాష్ట్రానికి తెలియజేయాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం అడిగిన ప్రశ్నలకు రాష్ట్రాలు సహకరించాలని సూచించింది. గవర్నర్ బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పుడు, రాష్ట్రపతి తిరస్కరిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్‌కు బిల్లులను ఆమోదించే, నిలిపివేసే లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం ఉంది. అయితే, గవర్నర్ బిల్లులను ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచడం, సదుద్దేశంతో వ్యవహరించకపోవడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది. బిల్లులను పునఃపరిశీలించిన తర్వాత తిరిగి పంపినప్పుడు, గవర్నర్ వెంటనే ఆమోదం తెలపాలని సూచించింది. రాష్ట్ర మంత్రి మండలి సలహా మేరకు గవర్నర్ పనిచేయాలని, ఒకసారి సభకు తిరిగి పంపిన బిల్లును రెండోసారి రాష్ట్రపతి పరిశీలనకు పంపకూడదని కోర్టు పేర్కొంది. గవర్నర్ బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి నిర్దిష్ట గడువు లేనప్పటికీ, ఆర్టికల్ 200 గవర్నర్‌కు బిల్లులను ఆమోదించకుండా, రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసే అధికారం ఇవ్వదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పు కాపీని అన్ని హైకోర్టులకు, రాష్ట్రాల గవర్నర్ల కార్యదర్శులకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. మంత్రి మండలి సలహా మేరకు బిల్లును నిలిపివేసినా లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపినా, గవర్నర్ గరిష్ఠంగా ఒక నెలలో నిర్ణయం తీసుకోవాలని సూచించింది. మంత్రి మండలి సలహాకు విరుద్ధంగా బిల్లును నిలిపివేస్తే, గరిష్టంగా మూడు నెలల్లో తిరిగి పంపాలని పేర్కొంది. పునఃపరిశీలన తర్వాత బిల్లును సమర్పిస్తే, గవర్నర్ గరిష్ఠంగా ఒక నెలలో ఆమోదం తెలపాలని కోర్టు ఆదేశించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపడంలో జాప్యంపై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. 2020 నాటి ఒక బిల్లుతో సహా 12 బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## త్వరలో తెలుగు రాష్ట్రాల
# ముఖ్యమంత్రుల భేటీ?

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సమావేశం కానున్నారని తెలుస్తోంది. విభజన సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఇందుకోసం ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టాక 2024 జులైలో తొలిసారి ఇరువురూ భేటీ అయ్యారు. అప్పట్లో ప్రజాభవన్ లో జరిగిన ఈ సమావేశంలో విభజన సమస్యలపై చర్చలు జరిపారు. విడిపోయి పదేళ్లయినా చట్ట ప్రకారం జరగాల్సిన పంపకాలు పూర్తికాకపోవడంపై ఇరువురు ముఖ్యమంత్రులు దృష్టి సారించినట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ ఇంకా పరిష్కృతం కాని సమస్యలపై తాజాగా మరోమారు భేటీ కావాలని ఏపీ సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, ముఖ్యమంత్రుల భేటీకి సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## సన్నబియ్యం పంపిణీకి స్పందన అద్భుతం

మొదటి పేజి తరువాయి



రూ.10వేల కోట్లు ఖర్చు చేశారని, తాము 3.10కోట్ల మందికి సన్నబియ్యం ఇవ్వడానికి రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ హయాంలో పండని పంట కాంగ్రెస్ హయాంలో పడిందని, తమది రైతు పక్షపాత ప్రభుత్వమనే దానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. అకాల వర్షాలతో రాష్ట్రంలో పలు చోట్ల ధాన్యం తడిసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చాలా ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని, తరుగు తీస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో సన్నబియ్యం రేషన్ మంచి పథకమని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సన్నబియ్యం పంపిణీకి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో 2.8కోట్ల జనాభాకు దొడ్డు బియ్యం ఇచ్చేందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేశారని, తాము 3.10కోట్ల మందికి సన్నబియ్యం ఇవ్వడానికి రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ హయాంలో పండని పంట కాంగ్రెస్ హయాంలో పడిందని, తమది రైతు పక్షపాత ప్రభుత్వమనే దానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.

# కేటీఆర్ కు డీకే అరుణ సవాల్

హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓ బీజేపీ ఎంపీకి కూడా ఈ వ్యవహారంతో సంబంధం ఉందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ పై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ విమర్శలు గుప్పించారు. విజయవాడలో డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్ కు దమ్ముంటే ఆ బీజేపీ ఎంపీ పేరు చెప్పాలని సవాల్ విసిరారు. ఆ ఎంపీ ఎవరో చెప్పకుండా... ఓ ఎంపీ అంటూ గాలి మాటలు మాట్లాడితే సరిపోదని అన్నారు. దక్షిణాదిపై బీజేపీ ఫోకస్ పెట్టిందని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో ఎనిమిది మంది ఎంపీలు గెలిచామని చెప్పారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ఉందని అన్నారు. ఏపీలో మళ్లీ ఎన్డీయే అధికారంలోకి వస్తుందని... తెలంగాణలో బీజేపీ స్వతంత్రంగా అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ ఒకటేనని... అందుకే తమిళనాడు సీఎం స్టాలిన్ చెన్నైలో నిర్వహించిన సమావేశానికి వెళ్లారని చెప్పారు. తమిళనాడులో స్టాలిన్, ఆయన కొడుకు ఉదయనిధి మాత్రమే అధికారంలో ఉండాలని అనుకుంటున్నారని విమర్శించారు.

## భారత ఐటీ రంగంపై ట్రంప్ పిడుగు..కోలుకోని దెబ్బే

ఢిల్లీ: మొన్నటికి మొన్న ఆటోమోటివ్ వాహనాలపై భారీగా పన్ను విధించారు ట్రంప్. 25 శాతం వరకు టారిఫ్‌ను పెంచారు. దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై కిందటి నెల 31వ తేదీ నాడే సంతకం చేశారు. అమెరికాకు ఆటోమోటివ్ వాహనాలను ఎగుమతి చేస్తోన్న భారత్ సహా అన్ని అన్ని దేశాలపైనా దీని ప్రభావం పడినట్టయింది. ఈ టారిఫ్.. ఈ నెల 2వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది.

బిలియన్ల కొద్దీ డాలర్ల కాంట్రాక్ట్‌లు రద్దు

అక్కడితో ఆగట్లేదాయన. ఇప్పుడు కొత్తగా భారత్‌పై 26 శాతం వరకు టారిఫ్ విధించారు. భారత్ నుంచి అమెరికాలో దిగుమతి అయ్యే ప్రతి వస్తువుపైనా ఈ పన్ను వర్తిస్తుంది. అంటే ఇప్పటివరకు ఉన్న టారిఫ్‌కు మరో 26 శాతం మేర అదనపు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. మేక్ అమెరికా వెల్త్ అగైన్ కాన్సెప్ట్‌లో భాగంగా టారిఫ్‌ను విధించాల్సి వస్తోందంటూ వివరణ ఇస్తోన్నారు.ఈ క్రమంలో మరో అడుగు ముందుకేశారు ట్రంప్. రక్షణ శాఖకు సంబంధించిన టెక్ దిగ్గజ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేయడానికి సిద్ధపడ్డారు. బిలియన్ల కొద్దీ డాలర్ల కాంట్రాక్ట్‌లు రద్దు కానున్నాయి. ఫలితంగా ఐటీ రంగం తీవ్ర కుదుపులకు లోనవుతుందనే అంచనాలు వ్యక్తమౌతోన్నాయి.

బిలియన్ డాలర్ల విలువ చేసే కాంట్రాక్టులను రద్దు

కాస్ట్- కటింగ్ చర్యలో భాగంగా డెలాయిట్, యాక్సెంచర్ వంటి సంస్థలతో గతంలో కుదుర్చుకున్న 5.1 బిలియన్ డాలర్ల విలువ చేసే కాంట్రాక్టులను రద్దు చేసినట్లు అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్ వెల్లడించారు. డెలాయిట్, యాక్సెంచర్, బూజ్ అలెన్, వాటికి మంజూరు చేసిన 5.1 బిలియన్ డాలర్ల ఐటీ, కన్సల్టింగ్ కాంట్రాక్టులను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

# హైకమాండ్ నిర్ణయం శిరోధార్యం




అమరావతి: వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనబోతోంది తమిళనాడు. అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐఏడీఎంకే ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. కొత్తగా ఆవిర్భవించిన టీవీకే సైతం పూర్తిస్థాయిలో ఈ ఎన్నికల బరిలో దిగబోతోండటం వల్ల త్రిముఖ పోటీ ఏర్పడటం ఖాయంగా కనిపిస్తోంది.

ఈక్వేషన్లు మళ్లీ మారాయి..

ఈ పరిస్థితుల్లో తమిళ రాజకీయాల్లో ఈక్వేషన్లు మళ్లీ మారాయి. ఇటీవలే ఢిల్లీలో అమిత్ షా- మాజీ ముఖ్యమంత్రి, ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఏఐఏడీఎంకేతో పొత్తు పెట్టుకుంది భారతీయ జనతా పార్టీ. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది.

రాష్ట్రస్థాయిలో చర్చలు సైతం..

ఈపీఎస్ ఢిల్లీ పర్యటనకు ముందు.. అన్నాడీఎంకే- బీజేపీ మధ్య రాష్ట్రస్థాయిలో చర్చలు సైతం జరిగాయి. బీజేపీ సానుకూల సంకేతాలను కూడా పంపించింది. బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి వ్యక్తిగతంగా ఈపీఎస్‌కు ఇష్టం లేకపోయినప్పటికీ- రాజకీయ మనుగడ కోసం తప్పనిసరి పరిస్థితులు, బీజేపీ హైకమాండ్ నుండి వస్తోన్న ఒత్తిళ్ల కారణంగా పళనిస్వామి తన మనసు మార్చుకున్నట్లు చెబుతున్నారు.

బీజేపీ ప్రభావం..

2016లో జయలలిత కన్నుమూయడం, పార్టీలో చీలిక ఏర్పడిన పరిస్థితుల్లో ఏఐఏడీఎంకే బీజేపీతో పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో అన్నాడీఎంకే ప్రభుత్వం తీసుకున్న అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై బీజేపీ ప్రభావం ఉందనే విమర్శలు సైతం వ్యక్తం అయ్యాయి.

నిలువనీడ లేకుండా

తమిళనాడులో 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఘన విజయం సాధించిన అనంతరం ఈక్వేషన్లు మారిపోయాయి. బీజేపీకి దూరం అయ్యారు ఈపీఎస్. 2023 సెప్టెంబర్‌లో పొత్తు తెంచుకున్నారు. 2024 నాటి లోక్‌సభ, అసెంబ్లీ ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ డీఎంకే తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించడం ఏఐఏడీఎంకేను నిలువనీడ లేకుండా చేసినట్టయింది.

దక్షిణాదిలో బీజేపీ వ్యతిరేక కూటమి..

అదే సమయంలో డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ దక్షిణాదిలో బీజేపీ వ్యతిరేక కూటమికి నాయకుడిగా ఎదుగుతోండటంతో పళనిస్వామి పునరాలోచనలో పడ్డారు. స్టాలిన్, ఆయన తనయుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ దూకుడుకు బ్రేకులు వేయాలంటే బీజేపీతో పొత్తు పెట్టుకోవడం తప్ప మరో మార్గం లేదనే నిర్ణయానికొచ్చారు. పొత్తులకు సై అన్నారు.

పొత్తును స్వాగతించిన పురంధేశ్వరి..

ఈ పరిణామాలపై బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమండ్రి లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడారు. పొత్తును స్వాగతించారు. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలే శిరోధార్యమని వ్యాఖ్యానించారు. పార్టీ శ్రేయస్సు, రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు నిర్ణయాలు ఉంటాయని వ్యాఖ్యానించారు.

సహజ భాగస్వామ్యం..

బీజేపీ-ఏఐఏడీఎంకే సహజ భాగస్వామ్యపక్షాలని పేర్కొన్నారు పురంధేశ్వరి. దురదృష్టవశాత్తు 2021 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో తాము కలిసి పోటీ చేయలేకపోయామని అన్నారు. ఇప్పుడు అమిత్ షా ఈ విషయంలో చాలా శ్రద్ధ చూపారని, ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. తమిళనాడులో ఉమ్మడి శత్రువును ఎదుర్కొనడానికి ఉమ్మడి అజెండాతో పోరాడాల్సి ఉందని పేర్కొన్నారు.

విచ్చలవిడిగా అవినీతి..

డీఎంకే ప్రభుత్వంలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని, దీనికి వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని పురందేశ్వరి చెప్పారు. డీఎంకేను ఓ విభజన పార్టీగా అభివర్ణించారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేకు ఓటమి తప్పదని, అక్కడ బీజేపీ- ఏఐఏడీఎంకే సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటవుతుందంటూ ధీమా వ్యక్తం చేశారు.

## సిబిఐటిలో భారతీయ జ్ఞాన వ్యవస్థ గురుంచి జాతీయ కార్యాగోష్టి



హైదరాబాద్, శుభోదయం న్యూస్: చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో భారతీయ జ్ఞాన వ్యవస్థల కేంద్రం %-%విజ్ఞాన అనుసంధాన కేంద్రంను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం "సస్టైనబుల్ అభివృద్ధికి భారతీయ జ్ఞాన వ్యవస్థల పునరుద్ధరణ " అనే అంశంపై జరిగే రెండు రోజుల జాతీయ కార్యాగోష్ఠిలో భాగంగా జరిగింది. ఈ కార్యాగోష్ఠికి ఐసిఎస్ఎస్ఆర్ , భారతీయ విద్యా మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేసింది. ఈ ఈవెంట్‌ను హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తున్నారు.ప్రారంభ ప్రసంగంలో శ్రీ జి. లక్ష్మణ్ జీ, అఖిల భారతీయ సంయుక్త నిర్వాహక కార్యదర్శి, ప్రసంగిస్తూ భారత సంప్రదాయం ధర్మ, అర్థ, కామ, మోక్ష తత్వాలతో పాటు "లోకాః సమస్తాః సుఖినో భవంతు" అనే సమగ్ర శాంతి సిద్ధాంతం మీద ఆధారపడిందని చెప్పారు. ఐఐటీ బొంబాయికి చెందిన ప్రొఫెసర్ కె. రామసుబ్రహ్మణియన్ గారు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, "భూమి జీవిస్తోన్న జీవి %-% మనం భూమిని ప్రేమిస్తే, ప్రకృతీ మనల్ని కాపాడుతుంది" అని చెప్పారు. ఆయన భారతీయ జ్ఞాన వ్యవస్థలు సమకాలీన సమస్యల పరిష్కారానికి ఎలా దోహదపడతాయో వివరణాత్మకంగా వివరించారు.సిబిఐటి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. వి. నరసింహులు ఈ ప్రారంభ కార్యాచరణను అభినందించారు. కొత్తగా ప్రారంభించిన కేంద్రం అంతరశాఖల పరిశోధనలకు వేదికగా మారుతుందన్నారు. కార్యక్రమ సందర్భంగా సావనీర్ను గౌరవ అతిథులు విడుదల చేశారు.ఉదయం సెషన్ చివర్లో డా. ఎస్. తులసి రామ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ఎమ్ఎస్, సిబిఐటి ధన్యవాదాలు తెలియజేశారు. సిబిఐటి యొక్క సమకాలీన విద్యా పరిశోధనలో భారతీయ జ్ఞాన వ్యవస్థలను అభివృద్ధి పరచాలని చెప్పారు. మధ్యాహ్న సెషన్లో, డా. డి. భరత్ కుమార్ గారు భారత తత్త్వశాస్త్రాని గురుంచి చెప్పారు. ఆయన మాట్లాడుతూ "అభ్యాసం" (నిరంతర సాధన), "వైరాగ్యం" (విరక్తి) వంటి తత్త్వాలు పతంజలి యోగ సూత్రాలలో ముఖ్యమైన మార్గాలుగా పేర్కొన్నారని, వీటిని కలిపి సాధన చేస్తే మోక్షం (విముక్తి) లభిస్తుందని వివరించారు. అలాగే, రుగ్వేదం టంకాలు, బావులు వంటి నిర్మాణాలను నేరుగా ప్రస్తావించకపోయినా, "ఆపః" అనే జల దేవతను మహిమ చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యతపై దృష్టి పెట్టిందని, దానివల్ల భారతీయ జల సంరక్షణ వ్యవస్థల మూలాలు ఏర్పడ్డాయని అన్నారు.

## డా,, బాబా సాహెబ్ భీం రాం అంబెద్కర్ 134వ జయంతి ఉత్సవాలు గణంగా జరుపు కోవాలి





మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్): తెలంగాన రాష్ట్రా అంబెద్కర్ యువజన సంఘం ఆర్గనైజింగ్ రాష్ట్రా కార్యదర్శి దిగొండ కాంతారావుజిల్లా ఆద్యక్షుడు నక్క బిక్షపతిపరం పూజ్య విశ్వ మేదావీ అట్టడుగు వర్గాల ఆశ కిరణం భారత రాజ్యాంగ నిర్మాత డా,,బి.ఆర్ అంబెద్కర్ గారి 134 వ జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 14 రోజున జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు యువజన సంఘ నాయకులు అన్ని ప్రజా సంఘాల మేదావులు గణంగా జరుపుకోవాలని యావత్ సమాజం అంబెద్కర్ చూపిన మార్గములో నడుచుకొని ముందుకు పోవలని ప్రభూత్వలు జయంతి ఉత్సవాలు అదికారికంగా నిర్వహించడం రాజ్యాంగ నిర్మాత సేవలకు నిదర్శనంగా దళిత సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నాము అని రాష్ట్రా ఆర్గనైజింగ్ కార్యదర్శి దిగొండ కాంతారావు జిల్లా అద్యక్షులు నక్క బిక్షపతి తెలిపారు.

## కొమ్మాల లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో అన్నదానం ప్రారంభించిన....

పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): శనివారం గీసుగొండ మండలం కొమ్మాల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు సాంప్రదాయ పద్ధతితో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సన్నిధిలో ప్రతి శనివారం నిర్వహించనున్న మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నిశాఖల అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకున్నామని,కొమ్మాల జాతర అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.అనంతరం జాతర విజయవంతం చేసిన సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు వారికి శాలువాతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తి అరెస్టు





ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్): రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ డిఐజి, మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి ఆదేశాలతో ఈరోజు మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో గల దీపక్ నగర్ లోని ఒక ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతున్న యువకుడిని పట్టుకున్నట్లు మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు.మందమర్రి పట్టణం దీపక్ నగర్ చెందిన ఒక యువకుడు (16 సంవత్సరాల 8 నెలలు) తన ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీచేయడం జరిగిందిన్నారు. ఇంటి వెనకాల తనిఖి చేయగా 12 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయని వెంటనే అట్టి మొక్కలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకొని అట్టి బాలుడిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు .మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా, ఎవరైనా గంజాయి అమ్ముతున్నట్లు పెంచుతున్నట్లు, అదేవిధంగా తాగుతున్నట్లు తెలిస్తే తక్షణమే పోలీసు లకి సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ వాళ్ళ కదలికలను చెడు అలవాట్లు గుర్తించాలని సందర్భంగా ఎస్ఐ కోరారు.అలాగే గంజాయి సేవించే వారిపై, గంజాయి పెంచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇట్టి సమాచార సేకరణలో చురుకుగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ అభినందించి రివార్డు అందజేశారు.

## ఆదివాసీల అభ్యున్నతికి విద్య మూలం, ఏ ఎస్ పి చిత్తరంజన్



ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్): పోలీస్ మీకోసం కార్యక్రమంలో భాగంగా కొమరం భీమ్ అస్మాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని మారుమూల ప్రాంతాలైన మంగి,కొలాంగుడా గ్రామాలలో పర్యటించి, ఆదివాసి కోలం గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ... యువత మరియు ప్రజలు మావోయిస్ట్ ల ప్రలోభాలకు లోనూ కావద్దని, వారికి సహకరించవద్దని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, సహకరిస్తారని తెలియజేశారు. ఈ పర్యటనలో భాగంగా చిన్నపిల్లలకి బిస్కెట్స్ అందించి మరియు చిన్నపిల్లలను కొలామిలో తాపేర్ అంటూ ప్రేమగా పలకరిస్తూ వారికి తెలుగు అక్షరాలు నేర్పడం మరియు పలకలను.పంపిణీ చేశారు ప్రజలకు ఏ సమస్యలు ఉన్న ప్రభుత్వం, పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని, పేర్కొన్నారు. యువత మావోయిస్ట్ లకు ఆకర్షితులు కావద్దని, ఉన్నత చదువులు చదవాలని పేర్కొన్నారు. యువత ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు , చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. విద్య తోనే అభివృద్ధి సాధ్యం అని, పిల్లలు,యువతను వారి తల్లితండ్రులు ఉన్నత చదువులు చదివించాలి అని తెలిపారు. విద్య, వైద్యం గురించి సహకారం కోసం పోలీసులను ఎల్లప్పుడు ఆశ్రయించవచ్చుని, తమకు పోలీస్ శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.గ్రామం లో నిషేధిత గంజాయి సాగు ను పండించవద్దని అన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిర్యాని ఎస్ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) : రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపును మా నియోజకవర్గం మరియు జిల్లా కాంగ్రెస్ శాఖ గట్టిగా స్వీకరించింది.ఈ సందర్భంగా రామగుండంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ గారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ. ఏం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కార్పొరేషన్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు మహిళా అధ్యక్షులు యువజన నాయకులు ఎన్ఎస్ఐ నాయకులు డివిజన్ ఇంచార్జిలో ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ అన్నది కేవలం




ఒక నినాదం కాదు, ప్రతి భారత పౌరుడి బాధ్యత. అయితే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం విభజించి పాలించు తత్వంతో దేశాన్ని ముక్కలు చేస్తోంది. సామాన్యుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ ధనవంతులకే మద్దతు ఇస్తోంది. మత విద్వేషాలు రెచ్చగొట్టి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే చర్యలకు పాల్పడుతోంది.ఈ నేపథ్యంలో ప్రతి పౌరుడు రాజ్యాంగ పరిరక్షణ కోసం సంఘటితంగా పోరాటం చేయాలి. సమానత్వం, స్వేచ్ఛ, బంధుత్వం విలువలను కాపాడుకుంటూ, బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు కృషి చేయాలి అని పిలుపునిచ్చారు.జై బాపు, జై భీమ్, జై సంవిధాన్.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాజా మాజీ కార్పొరేటర్లు, మహిళ నాయకురాలు వివిధ విభాగల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## : సీతారామాంజనేయ దేవస్థానంలో పూజలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం ముదిరాజ్







ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్): ఈరోజు కొము (ఆసిఫాబాద్)జిల్లా రెబ్బన మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన గావ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం ముదిరాజ్ ని సాదరంగా సన్మానించి స్థానిక సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది అనంతరం ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తూ అందరం కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు అనంతరం భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రెబ్బన మండల కేంద్రానికి ఫౌండర్ గా భావించే రాజు అగర్వాల్ ని వారి నివాసానికి వెళ్లి సన్మానించడం జరిగింది మరియు భారతీయ జనతా పార్టీ రెబ్బెన మండల నాయకులు పసుపులేటి మల్లేష్ నివాసానికి వెళ్లి సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షునిగా పదవి చేపట్టి విచ్చేసిన ధోని శ్రీశైలం ని శాలువా తో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, బిజెపి ఆదిలాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు మాలిక్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, బిజెపి రెబ్బెన మండల నాయకులు ముంజల వెంకన్న గౌడ్, సచిన్ జైశ్వాల్, సతీష్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగ వీర హనుమాన్ శోభాయాత్ర గజ్వేల్ పురవీధులు కాషాయమయం అధిక సంఖ్యలో పాల్గొన్న హైందవ సోదరులు



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 12: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గజ్వేల్ పట్టణంలో బజరంగ్ దళ్ విశ్వహిందూ పరిషత్ హైందవ సోదరుల ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. శోభయాత్రను శనివారం సాయంత్రం నాలుగున్నర గంటలకు గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వర దేవాలయ ప్రాంగణంలో పూజారి రాజశేఖర్ శర్మ, నంద బాల శర్మ పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. భక్తులనుద్దేశించి రాజశేఖర్ శర్మ మాట్లాడుతూ బోలా శంకరుడి అంతగా అవతరించిన హనుమంతుడికి చైత్రమాస వైశాఖ మాసం అత్యంత ప్రత్యేక మనీ రావణ సంహారం చేసి తిరిగి అయోధ్యకు చేరుకున్న రాముడు పట్టాభిషేకం పూర్తయిన తర్వాత చైత్ర పౌర్ణమి రోజు ఆంజనేయుని శ్రీరాముడు ప్రేమగా అలింగణం చేసుకొని కృతజ్ఞతలు తెలిపాడని అందుకే చైత్రమాస పౌర్ణమి రోజున ఆంజనేయుడికి అత్యంత ప్రత్యేకము కనుక హనుమన్ విజయోత్సవ యాత్ర జరుపుకుంటామన్నారు. నంద బాల శర్మ మాట్లాడుతూ హనుమంతుడి శక్తి కి నిస్వార్థ సేవకు ప్రతికగా హనుమాన్ విజయోత్సవ యాత్ర జరుపుకుంటామన్నారు హనుమంతుడు శ్రీరాముడికి గొప్ప భక్తుడని ఏ సమస్య వచ్చినా భయం కలిగిన భక్తులు హనుమాన్ చాలీసా చదవాలన్నారు. శోభయాత్రలో అత్యధికంగా యువకులు పాల్గొన్నారు శోభయాత్రలో ఎస్సార్ షాపింగ్ మాల్ యజమాని జయాల వేణుగోపాల్ స్వచ్ఛంద సంస్థలు స్థానిక ప్రజలు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన వేదికలపై భక్తులకు పులిహోర మంచినీటి ప్యాకెట్లు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శోభయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆంజనేయ స్వామిని స్మరిస్తూ ఉండటంతో యాత్రలో ఆధ్యాత్మికత భక్తి భావం వెల్లువెత్తింది. శోభయాత్రలు జైశ్రీరామ్ నామస్మరణతో అంగడిపేట హనుమాన్ ఇంద్ర పార్క్ చౌరస్తా మీదుగా సంగాపూర్ రోడ్ లోని సంతోషిమాత గుడి వరకు సాగింది. గజ్వేల్ నగర వీధులన్నీ కాషాయమయంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ యాత్రలో భారీ శ్రీరాముడి విగ్రహం మరియు ఆంజనేయస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాత్ర వెళ్లిన ప్రాంతాల్లో ట్రాఫిక్కు అంతరాయం కలవకుండా గజ్వేల్ సిఐ సైదా ఆధ్వర్యంలో పోలీసులు అప్పటికప్పుడు ట్రాఫిక్ ను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్ళించారు. యాత్ర వెళ్లే దారిలో భారీ కేడ్లను కూడా ఏర్పాటు చేశారు. శోభయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లను చేపట్టారు



## కన్నుల పండుగగా హనుమాన్ శోభాయాత్ర



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 12: హనుమాన్ విజయోత్సవ పర్వదినం పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్రను వర్గల్ మండల కేంద్రంలో హనుమాన్ భక్త బృందం, గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష భక్తజన సందోహంలో భాజ భజే ల మధ్య స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామపురవీధుల్లో పూర్వకస్తూ విజయోత్సవ ర్యాలీని అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది.

## నిరంకుశంగా వ్యవహరిస్తున్న రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు నీలం బిక్షపతి. ఎస్సీ సెల్ అధ్యక్షులు శనిగరపు శివకృష్ణ



రామగుండం మండలం రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయం న్యూస్) ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆ కారణంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని. చిన్న చిన్న కారణాలు చూపుతూ విధుల్లో నుంచి తొలగిస్తున్నారు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు మేడం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారిని చిన్నచూపుతో విధుల్లో నుంచి. తొలగించిన అడిగే నాధుడే లేడు. అన్నట్లుగా ఆ కారణంగా పదిమందిని తొలగించడం జరిగినది. స్కావెంజర్స్ చేసే పనిని స్లీపర్లతో చేయిస్తున్న విషయంపై ప్రశ్నిస్తే ఇష్టముంటే చేయండి, లేకుంటే తీసివేస్తానని నేను తీసేసిన మిమ్మల్ని అడిగే నాధుడే లేడంటూ నిరంకుశ విధానాలకు పాల్పడుతున్నది అధిక శ్రమ దోపిడీకి గురి చేస్తున్న ప్రిన్సిపాల్ మేడం పై గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ స్పందించి విధుల్లో నుంచి తొలగించబడ్డ వారికి తిరిగి ఉద్యోగం కల్పించడంతోపాటు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పై తగు చర్యలు తీసుకొని రామగుండం మెడికల్ కాలేజ్ నుండి బదిలీ చేయవలసిందిగా. టిఆర్ఎస్ (డి)పక్షాన కోరుకుంటున్నాము.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్) భక్తిశ్రద్ధలతో స్వామివారి దర్శనం చేసుకున్న ఆయన, రామగుండం ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని హనుమంతుని ఆశీస్సులు కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ ఎం. ఎస్. రాజ్ ఠాకుర్ మాట్లాడుతూ రామగుండం ప్రజలపై ఆంజనేయ స్వామివారి దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రతి ఒక్కరికీ శాంతి,



ఆనందం, ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నాను. అని పేర్కొన్నారు. అంతటితో పాటు, ఈ కార్యక్రమంలో అన్నదానం నిర్వహించి, ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఇందులో స్థానిక కార్పొరేషన్ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని దేవాలయాలూ భక్తులతో కిటకిటలాడిన ఈ పుణ్యదినం, రామగుండం ప్రజల జీవితాల్లో శాంతిని, ఐక్యతను తీసుకొచ్చేలా ఉండాలని ప్రతిఒక్కరూ ఆకాంక్షించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## మెరుగు రాధిక రమేష్ నివాసంలో సన్నబియ్యం బువ్వ తిన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ



పరకాల నియోజకవర్గం,(శుభోదయం న్యూస్) : ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ప్రశిష్ఠాత్మకంగా అందిస్తున్న సన్న బియ్యం కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట దమన్నపేట గ్రామంలోని సన్న బియ్యం లబ్ధిదారు మెరుగు రాధిక -రమేష్ ల నివాసం లో వారితో కలిసి ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం చేసిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ వర్ధన్నపేట



నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ కె.ఆర్ నాగరాజు ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపల్లి దేవేందర్రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పత్రి భాను ప్రసాద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏపి కుమార్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయండి : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ, శుభోదయం న్యూస్: ఏప్రిల్ 14 వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. శనివారం నాడు హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో అంబేద్కర్ 134 వ జయంతి సభ వాల్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ,జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కమీటీ చైర్మెన్ అంకేశ్వరపు రాంచందర్ రావు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమీటీ సభ్యులు పుట్ట రవి, డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, డివియంసి సభ్యులు చుంచు రాజేందర్, యంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు, కమీటి వైస్ చైర్మన్ గద్దల సుకుమార్ మాదిగ, యంఎస్పి జిల్లా అధ్యక్షులు,కమిటి వైస్ చైర్మన్ బండారి సురేందర్ లు మాట్లాడుతూ హనుమకొండ పట్టణ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఉదయం 8:30 గంటలకు పూలమాలాంకరణ నిర్వహించి,అనంతరం అంబేద్కర్ భవన్ లో ఉదయం 9:00 గంటలకు జయంతి సభ నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని ప్రజలు, ప్రజాసంఘాలు,విద్యార్థి సంఘాల నాయకులు,కుల సంఘాల నాయకులు, ప్రజా స్వామిక వాదులు,అంబేద్కర్ వాదులు,విద్యార్థులు, మేధావులు, మహిళలు,కార్మికులు,కర్షకులు,అధికారులు సకాలంలో హాజరై అంబేద్కర్ 134 వ జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డి డి శ్రీలత,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం



కోదాడ, ఏప్రిల్ 12.. శుభోదయం న్యూస్: కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఉయ్యాల నరసయ్య, ఈసీ మెంబర్ కారింగుల మురళి లను శనివారం సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజన్ గౌడ్ మాట్లాడుతూ. వామపక్ష భావజాలం ఉన్న వ్యక్తి అంచలంచెలుగా ఎదుగుతూ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గా ఎన్నిక కావడం నిజంగా అభినందనీయమన్నారు. నరసయ్య సారధ్యంలో కక్ష దారులు త్వరితగతిన న్యాయం జరిగేలా కేసులను వాదించాలని కోరారు. ఈసి మెంబర్ మురళి సైతం భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానిక ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదశ్రీ వెంకటేశ్వరరావు, మరికంటి లక్ష్మణ్, మల్లం రమేష్, లాయర్ బెల్లంకొండ గోవర్ధన్, మల్లేష్ ,బద్రి గౌడ్, సంపేట నరేష్, వీరబాబు, గోపాలకృష్ణ బండి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ వీర హనుమాన్ విజయాత్ర



కోదాడ, ఏప్రిల్ 12, శుభోదయం న్యూస్: విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ వీర హనుమాన్ విజయ యాత్రను శనివారం కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి బైక్ ర్యాలీగా సూర్యాపేట రోడ్ లో గల బ్రహ్మంగారి గుడి వరకు బజరంగ్ దళ్ విజయ యాత్రను విజయవంతం చేయడం జరిగింది. అనంతరం బ్రహ్మంగారి ఆలయంలోని అభయ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ వీర హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం

వెంకటగిరి, నియోజకవర్గం ఇంచార్జ్ – విసీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా డక్కిలి





మండలం దేవుని వెలంపల్లి గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ల 13/04/25 నుండి16/04/25 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నది ఈ సందర్భంగా స్వామి వారి గుడిని వివిధ రకాల విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో స్వామివారి తిరణాల అత్యంత వైభవంగా జరిగే ప్రముఖ పుణ్యక్షేత్ర తిరునాళ్ల సందర్భంగా దాదాపు లక్ష పైగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు దేవుని వెల్లంపల్లి చేరుకోవటానికి భక్తుల సౌఖ్యం కొరకు రాపూరు ఆర్టీసీ డిపో నుండి వెంకటగిరి డిపో నుండి ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ

## టంగుటూరులో జరిగిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతోత్సవాలు!



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా టంగుటూరు జ్యోతిరావు పూలే అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతోత్సవ కార్యక్రమం జరిగింది. ముందుగా పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ కన్వీనర్ బొడ్డు సతీష్ మాట్లాడుతూ దేశంలోని అసమానతలు తొలగించడానికి సామాజిక న్యాయ సూత్రాన్ని అందించిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. ఈ క్రమంలో ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత ప్రజా సంఘాల నాయకులు వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు పట్టణ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ఇంటర్మీడియట్ ఫలితాలలో పల్నాడు మరియు ప్రతిభ జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రభంజనం




మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జ్, వేల్పుల చిన్న గురవయ్య ( శుభోదయం న్యూస్) శనివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ మొదటి మరియు రెండవ సంవత్సరపు ఫలితాలలో పలనాడు మరియు ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు అసాధారణమైన మార్కులతో డివిజన్ మరియు పట్టణ ప్రథమ స్థానాన్ని పొందడం జరిగింది. ఈ ఫలితాలను కళాశాలల సెక్రెటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి తెలియజేస్తూ, పలనాడు జూనియర్ కళాశాల విద్యార్థిని సీనియర్ ఇంటర్ ఎం.పీ.సీ విభాగం నందు మునుపల్లి భానుమతి **987** మార్కులతో డివిజన్ స్థాయిలో, పట్టణ స్థాయిలో మొదటి ర్యాంకును పొందిందని, రాచూరి జలీల్ **977**, రాళ్లపల్లి స్వాతి **976** పొందినారు అని తెలియజేశారు. అదేవిధంగా ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థిని సయ్యద్ నాజియా పర్వీన్ **968**, జీ.వీ.ఎల్.సాహితి **965**, జి. ప్రవీణ్ **965** మార్కులు పొందినట్లు తెలియజేశారు. సీనియర్ ఇంటర్ బై.పీ.సీ విభాగంలో పీ.మోషే **939**, జి.హారిక **928**, షేక్ వాహిదా **923** మార్కులు పొందినారు. సీనియర్ ఇంటర్ సీ.ఈ.సీ ఫలితాలలో జె. నాగ దుర్గ **903** మార్కులతో పట్టణంలో ద్వితీయ ర్యాంకులు పొందినట్లుగా తెలియజేశారు. పలనాడు జూనియర్ కాలేజీ విద్యార్థులు **25** మంది ప్రతిభా జూనియర్ కాలేజీ విద్యార్థులు **16** మంది **900** మార్కులకు పైగా సాధించినారు. జూనియర్ ఇంటర్ ఫలితాలలో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థి కె. దుర్గా తిరుపతిరావు **464** మార్కులతొ డివిజన్ మరియు పట్టణ ప్రథమ స్థానాన్ని పొందినట్లు తెలియజేశారు. పలనాడు జూనియర్ కాలేజీ విద్యార్థి తిర్లికా విశ్వ చైతన్య **461** మార్కులతో పట్టణ ద్వితీయ స్థానాన్ని పొందినట్లు, రాచ మడుగు లక్ష్మీ సుహాశ్రీ **460**, కొత్త మాసు వెంకట అనంతలక్ష్మి నిహిత్ **458**, ఏ శ్రీలక్ష్మి **453** మార్కులు పొందారు. జూనియర్ ఇంటర్ బై.పీ.సీ విభాగంలో షేక్ షమీనా **409** మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానాన్ని, ఎస్ ఉదయరాజు **401** మార్కులతో పట్టణంలో ద్వితీయ స్థానాన్ని , అదేవిధంగా జూనియర్ ఇంటర్ సీ.ఇ.సీ విభాగంలో కే. సాయి రమ్య **457** మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానాన్ని పొందినట్లు తెలియజేశారు. పల్నాడు జూనియర్ కాలేజీ విద్యార్థులు **22** మంది ప్రతిభ జూనియర్ కాలేజీ విద్యార్థులు **15** మంది **400** మార్కులు పైగా సాధించినారు అని తెలియజేశారు. గ్రూపు సబ్జెక్టుల యందు వందకు వందశాతం ఫలితాలను నలుగురు విద్యార్థులు పొందారు. ఉత్తమ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులను కళాశాల చైర్మన్ మారేపల్లి లక్ష్మీనారాయణ అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనలో తమకు సహకరించిన విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు కళాశాల ప్రిన్సిపాల్స్ నూతలపాటి శివ భాస్కర్ , మద్రి వెంకటనారాయణలు కృతజ్ఞతలు తెలియజేశారు. అత్యుత్తమ ఫలితాల సాధనలో, కళాశాల విజయంలో భాగమైన అందరికీ కళాశాల డైరెక్టర్లు ఇరువంటి ఆంజనేయ శాస్త్రి, షేక్ మస్తాన్ వలి అభినందించారు. ఈ సందర్భంలో కళాశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. సీనియర్ మరియు జూనియర్ ఇంటర్ ఎం.పీ.సీ విభాగాలలో కే దుర్గా తిరుపతిరావు **464**, ద్వితీయ ఎం.పీ.సీ గ్రూపు నందు **987** మార్కులతో మొదటి స్థానాన్ని, పొందటమే కాక ఇప్పటివరకు పల్నాడు చరిత్రలో ఎప్పుడూ పొందునటువంటి మార్కులు పొంది, కళాశాలకు, పట్టణానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకొచ్చినటువంటి విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు




పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ - శీనివాసరావు (శుభోదయం నూస్): గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ యరపతినేని శ్రీనివాసరావు జన్మదినం పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణంలోని ఐలాండ్ సెంటర్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ నిర్వహించబడుచున్నది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించును. పిడుగురాళ్ల పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు తెలియజేయడమైనది. ఈ జన్మదిన వేడుకలకు పట్టణ పుర ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరు,రేపు అనగా (ఆదివారం) 13, తారీఖున ఉదయం 10:30 కు పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్ వద్దకు రావలసిందిగా తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు.

## దేశంలో మత కల్లోలం సృష్టిస్తున్న బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు వెలగపూడి ఆజాద్



గన్నవరం, నియోజకవర్గం- ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): దేశంలో మతకల్లోలం సృష్టిస్తున్న బిజెపి ప్రభుత్వం అని జిల్లా కార్యవర్గ సభ్యులు వెలగపూడి ఆజాద్ విమర్శించారు శుక్రవారం గన్నవరం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ జాతీయ పార్టీ ఆదేశాల ప్రకారం బిజెపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా గన్నవరం పట్నంలో కరపత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు%శ్రీ% మోడీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ఎన్నిసార్లు పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు పెంచిందో లెక్కలేదు అన్నారు.మోడీ వచ్చేసరికి డీజిల్ ధర 55 రూపాయలు పెట్రోల్ 60 రూపాయలు గ్యాస్ 450 ఉండేదాని ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లుగా పెంచుతుందాని విమర్శించారు ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పెనుబారంగా మారిందని విద్యుత్తు సంస్కణ లు పేరుతొ స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ భారలు మోపిందన్నారు. రాష్ట్రాలకు నజరాలు ఎర్రగా చూపి వేల కోట్లు విద్యుత్తు భారం మోపిందని అన్నారు బిజెపి ప్రభుత్వం ఆ వాగ్దానాలు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు నక్సలైట్లు లను వేరువేత పేరుతో గిరిజన ప్రజలను దోపిడీ చేస్తూ అడవి సంపద కార్పోరేట్ లకు పంచి పెడుతుందని విమర్శించారు సిపిఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బిజెపికి దాసోహం చేస్తుందన్నారు పవన్ కళ్యాణ్ ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉండి సంఘ పరివార్ శక్తులతో ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.గతం లో అధికారంలో ఉన్న వై సి పి నరేంద్ర మోడీ విధానాలకు తూచి తప్పకుండా అమలు చేసింది అన్నారు. కార్యవర్గ సభ్యులు ఎస్ టి యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు పెద్దు వెంకటరత్నం మాట్లాడుతూ బిజెపి ప్రజావ్యతిరేక విధానలకు నిరసనగా ప్రజాస్వామ్య లౌకిక శక్తులు యువజన విద్యార్థులు కార్మిక రైతులు రైతు కూలీలు అన్ని వర్గాలు ప్రజలు నిరంతర పోరాటం చేయవలసిన ఆసన్నమైందని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కామల ఉమామహేశ్వర రావు కార్యవర్గ సభ్యులు శనగల సుబ్బారెడ్డి కట్టవరపు విజయ రావు కాట్రగడ్డ రామచంద్ర జోషి సభ్యులు నూతక్కి మోహన్ రావు కట్టవరపు మోహన్ రావు నందం బసవేశ్వర రావు నాగేశ్వరావు చాగంటి పాటి భవాని ప్రసాద్ చాగంటిపాటి అశోక్ కుమార్ గోగం ధన బాబు రేమల్లి రాజేష్ గురువయ్య, కూరటి సుగుణరవు, తదితరులు పాల్గొన్నారు.

## విలేజ్ హెల్త్ క్లినిక్ ను సందర్శిస్తున్న ఎంక్వెస్ టీం



చార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): శుక్రవారం మండలంలోని ఉంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ముక్కపాడు విలేజ్ హెల్త్ క్లినిక్ ను (నేషనల్ ఎక్యూరెన్స్ క్వాలిటీ కంట్రోల్) ఎంక్వస్ టీం సందర్శించి హెల్త్ క్లినిక్ పరిధిలో జరుగుతున్న వైద్య సేవలను పరిశీలించి టెలికాన్ఫరెన్స్ ద్వారా డిల్లీ హెడ్ క్వార్టర్స్ సిబ్బందికి వివరించామని టీం కోఆర్డినేటర్ డాక్టర్ చైతన్య అన్నారు. చైతన్య మీడియాతో మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు వల్ల గ్రామంలో ఉన్న వారు పిహెచ్ సి వరకు వెళ్ళకుండా అన్ని రకాల వైద్య సదుపాయం ఇక్కడ దొరుకుతుంది అని అందుకే విలేజ్ హెల్త్ క్లినిక్ ల అభివృద్ధి కోసం నూతన భవనాలు నిర్మించడంతో పాటు తగిన సిబ్బందిని ఏర్పాటు చేసి, కావలసిన మందులు పరికరాలను ఏర్పాటు చేయడం కోసం, ఈ సందర్శనా కార్యక్రమం నిర్వహించి ఇక్కడ పరిస్థితి ని సెంట్రల్ కు వివరిస్తున్నామని తద్వారా మరింతగా మెరుగైన ఆర్థిక తోడ్పాటును పొందేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు డాక్టర్ సంధ్య, పిహెచ్ సి వైద్యులు డాక్టర్ వాణి, హెల్త్ సూపర్వైజర్ సాల్మన్ రాజు, ఎంఎల్ హెచ్ పీ లు, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## నాగిశెట్టి వెంకట యశస్విన్ చరణ్ ను అభినందించిన పలువురు ప్రముఖులు

పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): విశ్వశాంతి జూనియర్ కళాశాల (ఉయ్యూరు)లో ఇంటర్మీడియట్ అత్యున్నత ఫలితాలో భాగంగా పామూరు పట్టణ వైఎం ఫ్యాషన్ వరల్డ్ అధినేత నాగిశెట్టి శ్రీనివాసులు కుమారుడు నాగిశెట్టి వెంకట యశస్విన్ చరణ్ ప్రతిభ చాటాడు 1000 మార్కులు గాను 957 వచ్చినందుకు పలువురు చరణ్ అభినందించారు.

# : ఇంటర్ ఫలితాల్లో వికెఆర్ కళాశాల ప్రభంజనం..






గన్నవరం, నియోజకవర్గం ఇంచార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో గన్నవరం వికెఆర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సష్టించారనిప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారని చెప్పారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసి విద్యార్థిని యశస్వి 976/1000 సాధించి కళాశాల ప్రతిష్టను నలుదిశలా ఇనుమడింప చేశారని తెలిపారు. కళాశాలలో 92 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో హర్షిని 973/1000 మార్కులు సాధించింది. సీఈసీలో దివ్య సాయి ప్రవల్లిక 928/1000, హెచ్ఈసి లో గీత 759/1000 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని వివరించారు. 900 మార్కులు పైన 25 మంది, 800 పైన 32 మంది, 750 పైన మార్కులు 56 మంది సాధించారని చెప్పారు.మొదటి సంవత్సరం ఎంపిసిలో 470 మార్కులకు 418 మార్కులు గుణశేఖర్ అనే విద్యార్థి సాధించి కళాశాల టాపర్ నిలిచారని తెలిపారు. బైపీసీలో వేష్షిత 415, సీఈసి లో 423/500 మార్కులు, హెచ్ఇసిలో సాత్విక 401/500 మార్కులు సాధించి టాపర్లుగా ఉన్నారని తెలిపారు. 400 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 35 మంది ఉన్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాల సాధనకు పాటుపడిన అధ్యాపకులు, విద్యార్థులను కళాశాల యజమానియా కమిటీ అధ్యక్షులు వెంకట్ మొట పర్తి, కార్యదర్శి జి ఎస్ ఎల్ ఎన్ ప్రసాద్ అభినందించినట్లు తెలిపారు.

# తెలుగుదేశం పార్టీలో కొత్త వ్యవస్థ





గన్నవరం, నియోజకవర్గం ఇంచార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్): 60 మంది ఓటర్లకు ఇద్దరు సాధికార సారధులుతెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల షెడ్యూల్ విడుదలరాబోయే 40 సంవత్సరాలకి టీడీపీ కోసం బలంగా పనిచేసే వారిని ఎన్నుకోండికార్యకర్తల సమావేశంలో వెల్లడించిన గన్నవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వద్రాణం హరిబాబుతెలుగుదేశం పార్టీ అధిష్టానం సంస్థాగత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ప్రభుత విప్, గన్నవరం నియోజకవర్గ శ్యాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలమేరకు ఈరోజు సాయంత్రం బాపులపాడు మండల టిడిపి కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా గన్నవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వద్రాణం హరిబాబునాయుడు పాల్గొని నేతలకు దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బాపులపాడు మండల టిడిపి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబ సాధికార సారధులు నియామకాలను వేగవంతం చేసి త్వరితగతిన తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని నేతలకు వివరించారు.అనంతరం వద్రాణం హరిబాబునాయుడు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ లోపు కె ఎస్ ఎస్ ల నియామకాలు పూర్తి చేసి అనంతరం టీడీపీ పార్టీ పట్ల క్రమశిక్షణతో పనిచేసేవారిని బూత్ కమిటీల ఇంచార్జిలుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 22 వ తేదీ లోపు నూతన గ్రామ కమిటీలను పూర్తి చేయాలని, రాబోయే 40 సంవత్సరాలకు టీడీపీ పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారని నాయకులుగా నియమించాలని శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గత 5 సంవత్సరాలు కష్టపడి పని చేసిన సీనియర్ నాయకులకు గుర్తింపునిస్తూ తగిన విధంగా పదవులు కేటాయించాలని నాయకత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల టిడిపి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్ (సూర్యం), మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, రాష్ట్ర టిడిపి నాయకులు గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, జిల్లా టిడిపి నాయకులు మొవ్వ వెంకటేశ్వరరావు, వడ్డీల్లి లక్ష్మి, టిడిపి నాయకులు కొమ్మారెడ్డి రాజేష్, మండాది రవీంద్ర, చలసాని శ్రీనివాసరావు, దయాల రాజీవ్ కాంత్, చిన్నాల లక్ష్మీనారాయణ, చెరుకూరి హరికృష్ణ, మొవ్వ వేణుగోపాల్, కొండపల్లి వెంకటేశ్వరరావు, కొండేటి నాగరాజు, నక్కా ప్రసాద్ (నాగరాజు), సాయిల నాగేశ్వరరావు, సజ్జా చలమారావు, ఆలూరి రాంబాబు, యనమదల శ్రీనివాసరావు, తడిశెట్టి నాగరాజు, బోడిచెర్ల స్వామి, కర్రా ప్రసాద్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం ముఖ్యం : యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గం ఇంచార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్): గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. గన్నవరం మండలం బి. బి.గూడెం గ్రామంలో దాతల సహకారంతో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి శనివారం సాయంత్రం యార్లగడ్డ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ గూడెం గ్రామపంచాయతీ నిర్మాణానికి గ్రామస్తుల అందించిన సహకారం మరువలేనిది అన్నారు. పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి మూడు సెంట్ల భూమిని ఉచితంగా ఇచ్చిన వేమూరి గోపాలరావు కుమారులను ఈ సందర్భంగా యార్లగడ్డ అభినందించారు. పంచాయతీ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన డాక్టర్ బి.ఆర్.ఎల్.ప్రసాద్ రూ.20 లక్షలు విరాళం ఇవ్వగా మరో రూ.20 లక్షలు గ్రామస్తులు విరాళాలు సమకూర్చుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇదే రీతిగా అన్ని గ్రామాల్లోనూ దాతలు ముందుకు వస్తే గ్రామాల రూపురేఖలను మార్చవచ్చని అభిప్రాయపడ్డారు. అన్ని పనులు ప్రభుత్వమే చేయాలంటే కొంతమేర జాప్యంతో పాటు నిధుల కొరత ఉంటుందని దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ప్రభుత్వ పరంగా కావలసిన అనుమతులు మంజూరు చేయడంతో పాటు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని యార్లగడ్డ తెలిపారు. అధ్వానంగా మారిన గన్నవరం ఆగిరిపల్లి రహదారి లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను చూసి ఈ రహదారి పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించిన సంగతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు తమ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆయన వివరించారు. విఎన్ పురం కాలనీలో రూ. 27 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొమ్మరాజు సుధీర్, గ్రామ సర్పంచ్ దొప్పలపూడి విజయలక్ష్మి, ఎంపీటీసీ మోరం నాగరాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి శివ నాగరాజు, నాయకులు బోయపాటి బసవపూర్ణయ్య( నల్లబాబు) బోయపాటి మురళీకృష్ణ (బుల్లియ్య ), తమ్మిశెట్టి నాగ మురళీకృష్ణ, కోటగిరి వరప్రసాద్, దొంతు చిన్న, తెలుగు యూవత నాయకులు పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం కాసర్నేని రంగబాబు,మద్దినేని వెంకటేశ్వరరావు, దాతలు, స్థానికులు పాల్గొన్నారు.



## ట్రావెల్ జర్నలిజంలో ప్రతిభకు గుర్తుగా ప్రభుదాస్ కి అవార్డ్

## సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్.వి రమణ చేతులమీదుగా పురస్కారం



ఏలూరు, శుభోదయం న్యూస్:ట్రావెల్ జర్నలిజంలో ప్రతిభకు గుర్తుగా ఏలూరు కి చెందిన ధనియాల ప్రభుదాస్ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును శనివారం అందుకున్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన తెలుగు జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్.వి, రమణ చేతులమీదుగా ప్రభుదాస్ ఈ ప్రత్యేక అవార్డును అందుకున్నారు.2024లో ఈ అవార్డు ఎంపిక కొరకు తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వారికి ఆన్లైన్ లో పంపిన దరఖాస్తుల పరిశీలనలో ప్రభుదాస్ పేరు ఎంపిక చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్- తెలంగాణ రెండు రాష్ట్రాల పరిధిలో ఏకైక ట్రావెల్ జర్నలిస్ట్ గా ఎంపికై దేశ అత్యున్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి ఎన్.వి.రమణ గారి చేతులమీదుగా ఈ అవార్డ్ అందుకోవడం చాలా ఆనందంగా ఉందని ప్రభుదాస్ అన్నారు.ఈ ప్రత్యేక అవార్డుకు ఎంపిక చేసిన తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వారికి అవార్డు గ్రహీత ప్రభుదాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో గురుకుల పాఠశాలల విద్యార్థులు హవా! అభినందనలు తెలిపిన మంత్రి డోల



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని తూర్పు నాయుడుపాలెం లోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు 94.7% ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నతాధికారులు మరియు ఉపాధ్యాయ సిబ్బందికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. గతం కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించామని పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలని మంత్రి వీరాంజనేయ స్వామి పేర్కొనడం జరిగింది.

## 5 లక్షల కోట్ల టన్నుల మంచు కరిగింది



అపారమైన మంచు నిల్వలకు గ్రీన్‌లాండ్ ఆలవాలం. ప్రపంచంలోని మొత్తం మంచినీటిలో 8 శాతం అక్కడే ఉందని అంచనా. అలాంటి గ్రీన్‌లాండ్‌లో మంచు శరవేగంగా కరిగిపోతోంది. ఎంతగా అంటే ఏటా సగటున 5,500 కోట్ల టన్నుల మేరకు! 1992లో మొదలైన ఈ ధోరణి ఏటా అంతకంతకూ పెరుగుతూనే వస్తోందట. ఆ లెక్కన గత 28 ఏళ్లలో అక్కడ ఏకంగా 5 లక్షల టన్నుల మంచు మాయమైపోయిందట! గ్రీన్‌లాండ్‌పై గ్లోబల్ వార్మింగ్ ప్రభావంపై చేపట్టిన అధ్యయనంలో సైంటిస్టులు ఈ మేరకు తేల్చారు. ఇది ఒక్క గ్రీన్‌లాండ్‌కే పరిమితం కాదని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌ఓఏఏ) తెలిపింది. "మొత్తమ్మీద ధ్రువాల వద్ద మంచు కరుగుదల ప్రమాదకర స్థాయిలో ఉంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం"అని ఆందోళన వెలిబుచ్చింది. అక్కడ మంచు ఈ స్థాయిలో కరిగిపోవడానికి నిర్దిష్ట కారణాలేమిటో తేల్చే పనిలో పడింది. అక్కడినుంచి ఆవిరవుతున్న నీరు ఎటు వెళ్తోందో తెలియడం లేదని సైంటిస్టులు చెబుతున్నారు. ఈ మిస్టరీని ఛేదించేందుకు అక్కడి నీటి ఆవిరిని డ్రోన్ల సాయంతో సేకరించి పరిశోధిస్తున్నారు. ఇందుకోసం భూ ఉపరితలం నుంచి 5,000 అడుగుల ఎత్తు దాకా వివిధ స్థాయిల్లో నీటి ఆవిరిని పలు దఫాలుగా సేకరించారు. "ఆవిరయ్యే నీటిలో ఎంతోకొంత తిరిగి మంచుగా మారి అక్కడే పడుతుంది. కానీ చాలావరకు మాత్రం గ్రీన్‌లాండ్ జలవ్యవస్థకు శాశ్వతంగా దూరంగా వెళ్లిపోతోంది. ఇదే ఆందోళన కలిగించే విషయం"అని అధ్యయనానికి సారథ్యం వహించిన కెవిన్ రోజ్మియారెక్ వివరించారు.

## ఈసారి ఎండలు ఎక్కువే!



న్యూఢిల్లీ: ఈసారి ఎండల భగభగ తప్పదని వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎండలు సాధారణానికి మించిన తీవ్రతతో ఉండొచ్చని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. మధ్య, పశ్చిమ, వాయవ్య భారతం మైదాన ప్రాంతాల్లో వడగాడ్పులు ఎక్కువ రోజులు కొనసాగే అవకాశముందని కూడా అంచనా వేసింది. తూర్పు, పశ్చిమ భారతం మినహా దేశంలోని మిగతా అన్ని ప్రాంతాల్లోనూ ఈసారి సాధారణ గరిష్ట స్థాయికి మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. తూర్పు, పశ్చిమ భారత్‌లో సాధారణ ఉష్ణోగ్రతలే కొనసాగుతాయంది. అత్యధిక ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగతలు సైతం సాధారణ స్థాయికి మించి ఉండే అవకాశముందని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర సోమవారం వర్చువల్ మీడియా సమావేశంలో వివరించారు.'ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉత్తర, తూర్పు, మధ్య భారతదేశం, వాయవ్య భారతంలోని మైదాన ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి నాలుగు రోజులు అధికంగానే వడగాడ్పులు వీచే అవకాశముంది. మామూలుగా, ఈ కాలంలో నాలుగు నుంచి ఏడు రోజులు మాత్రమే వడగాడ్పులు వీస్తుంటాయి'అని ఆయన తెలిపారు. వడగాడ్పుల తీవ్రత తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో రాజస్తాన్, గుజరాత్, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్, జార?ండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లతోపాటు కర్ణాటక తమిళనాడుల్లోని ఉత్తర ప్రాంతాల్లో ఎక్కువగానే ఉంటుందని ఐఎండీ పేర్కొంది.

## ఎటిఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు



అమరావతి: ఈ- కేవైసి ప్రక్రియ పూర్తయ్యాక కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ఎపి పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మే నెల నుంచి ఎటిఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని అన్నారు. ఆయన నెల్లూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డులకు ఆప్షన్లు ఉంటాయన్నారు. క్యూఆర్ కోడ్, ఇతర భద్రతా ఫీచర్లతో కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. ఈ- కేవైసి పూర్తయితే ఎంతమందికి కార్డులు ఇవ్వాలో స్పష్టత వస్తుందని తెలియజేశారు. నేటి నుంచి దీపం-2 రెండో విడత సిలిండర్ బుకింగ్ ప్రారంభమైందని, కొత్తగా 2 లక్షల మంది గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నారని కంపెనీలు చెప్పాయని పేర్కొన్నారు. ఖరీఫ్ లో 35.93 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ధాన్యం కొన్న 24 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని అన్నారు. వాట్సప్ లోనూ ధాన్యం కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించామని, మొత్తం 16 వేల మంది రైతులు వాట్సప్ ద్వారా ధాన్యం అమ్మారని చెప్పారు. ఎపి పోర్టుల ద్వారా తెలంగాణ లక్షన్నర టన్నుల బియ్యం ఎగుమతి చేసిందని, ఎగుమతులకు కేంద్రం అనుమతి మంజూరు చేసిందని అన్నారు.. జూన్ నుంచి మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం సరఫరా జరుగుతుందని వెల్లడించారు. ఎండియూల కొనుగోలు పెద్ద కుంభకోణం.. దీనిపై విచారణ జరుగుతోందని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

## అప్పటి నుంచి అవి ప్రభుత్వ భూములే..: మహేష్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: కంచె గచ్చిబౌలిలోని భూముల విషయంలో పెద్ద ఎత్తున రభస జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ భూములను పరిరక్షించాలంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనకు ప్రతిపక్ష పార్టీల నుంచి మద్దతు లభిస్తుంటే.. ప్రభుత్వం మాత్రం ఆ భూములు తమవేనని అంటోంది. తాజాగా ఈ భూముల విషయంపై టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందించారు. హెచ్‌సియు భూములకు బదులు ఎప్పుడో ప్రభుత్వ భూములను ఇవ్వడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అవి ప్రభుత్వ భూములే అని పేర్కొన్నారు. హెచ్‌సియు భూములను ప్రభుత్వం లాక్కోవట్లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకూ కోర్టులో కేసు నడుస్తున్నందు వల్ల భూములను స్వాధీనం చేసుకోలేదని..కోర్టు కేసు అయిపోయింది కాబట్టి ఇప్పుడు భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు.

## పుణే అటవీ శాఖలో సరికొత్త పర్యాటక ప్రయోగం

### గ్రాస్ ల్యాండ్ సఫారీతో పర్యాటకులకు కొత్త అనుభూతి

### తాజాగా షోలాపూర్‌లోని బోరామణిలో మరో సఫారీ అందుబాటులోకి

# గడ్డిభూముల్లో హాయ్.. హాయ్



సఫారీ.. ఈ మాట వింటే ఠక్కున గుర్తొచ్చేది దక్షిణాఫ్రికా. సవన్నాలుగా పిలిచే విశాలమైన పచ్చిక భూముల ప్రాంతం క్రూర మృగాలు, వన్యప్రాణుల ఆవాసం. కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ ప్రాంతంలో విహరిస్తుంటే ఆ ఆనందమే వేరు. అందుకే ఆ దేశం పర్యాటకానికి ప్రాధాన్యమిస్తోంది. తద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలను సృష్టిస్తోంది. ఈ విషయంలో భారత్ సైతం ఇప్పుడిప్పుడే చొరవ కనబరుస్తోంది. గడ్డిభూములున్న ప్రాంతాలను గుర్తించి పర్యావరణ, పర్యాటకాన్ని ద్విగుణీ కృతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇంతకీ ఆ గడ్డిభూములు ఏ రాష్ట్రంలో ఉన్నాయి? అక్కడి విశేషాలేంటి?

### మహారాష్ట్ర మొదటగా..

పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా పుణే(మహారాష్ట్ర) లోని అటవీ శాఖ షోలాపూర్‌లో గ్రాస్ ల్యాండ్ సఫారీ (గడ్డి భూముల్లో విహారయాత్ర)కి శ్రీకారం చుట్టింది. ఇక్కడి బోరామణి గ్రామ గడ్డి భూముల్లో తాజాగా ఈ ప్రక్రియను చేపట్టింది. ఈ భూములు కృష్ణ జింకలు, తోడేళ్ళు, బెంగాల్ నక్కలు, అడవి పందులు, రంగురంగుల సీతాకోకచిలుక జాతులకు ఆవాసాలు. ముఖ్యంగా అంతరించిపోతున్న అరుదైన బట్టమేక పక్షి (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) ఉనికి ఇక్కడ కనిపిస్తుంది. వాటి సహజ ఆవాసాలను వాహనాల్లో సంచరిస్తూ వీక్షించే అవకాశాన్ని అటవీశాఖ కల్పిస్తోంది.

### రోజుకు రెండు సార్లు మాత్రమే..

ఈ గ్రాస్‌ల్యాండ్ సఫారీ రెండు విడతల్లో ఉంటుంది. ఉదయం 6:30 నుంచి 10:30 వరకు, మధ్యాహ్నం 3:30 నుంచి 6:30 గంటల మధ్యలో విహరించేందుకు అనుమతిస్తున్నారు. వన్య ప్రాణులు, పర్యావరణ వ్యవస్థకు అంతరాయం కలిగించకుండా పరిమిత సంఖ్యలో వాహనాల్లో సంచరించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సందర్శకులకు మెరుగైన అనుభవాన్ని పంచడానికి అటవీ శాఖ రాత్రి పూట బసలను అందుబాటులో ఉంచింది. ఈ గడ్డిభూముల్లో సందర్శకులు సొంత వాహనాల్లో, అద్దెవాహనాల్లో విహరిస్తూ ఆస్వాదించే సౌకర్యం కల్పించింది.

### కర్బన శోషకాలు.. గడ్డిభూములు

కర్బన ఉద్గారాలతో పాటు ఉదజని (కార్బన్ డయాక్సైడ్)ని శోషించి వాతావరణాన్ని నియంత్రించడంలో గడ్డిభూములది కీలక పాత్ర. కృష్ణ జింకలు, జింకల్లాంటి శాకాహారులు, తోడేళ్లు, నక్కల్లాంటి మాంసాహారులు పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిలో ఎనలేని పాత్ర పోషిస్తాయి. గడ్డిభూముల సంరక్షణ విషయానికి వస్తే..అడవులతో పోల్చి చూస్తే తక్కువే అని చెప్పొచ్చు. పర్యావరణ స్థిరత్వాన్ని కాపాడటంలో ఇవి ఎంతో ముఖ్యమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రకృతి ప్రేమికులు, ఫొటోగ్రాఫర్లు, పరిశోధకులకు స్వేచ్ఛగా గడ్డిభూముల్లో విహరించే వీలు కల్పించడం ద్వారా వీటి సంరక్షణపై అవగాహన తీసుకురావచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

### 2024 జనవరిలో ప్రారంభం

గడ్డిభూముల్లో సఫారీకి 2024 జనవరిలో పుణే, షోలాపూర్ ప్రాంతాల్లో తొలిసారిగా శ్రీకారం చుట్టారు. ఇక్కడ అటవీ రేంజ్ లోని గడిఖేల్, శిర్షుపాల్, సబ్లెవాడీ, పర్వాడీ పరిధిలో విశాలమైన పచ్చిక బయళ్లలో సఫారీ ప్రారంభించారు. ఇది విజయవంతం కావడంతో గడ్డిభూములున్న ప్రాంతాల్లో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగుతున్నారు. దీంతో స్థానికులకు ప్రత్యక్ష,ంగా, పరోక్షంగా ఉపాధి దొరికింది. శిక్షణ పొందిన స్థానిక గైడ్లకు రూ. వేలల్లో ఆదాయాన్ని తెచ్చిపెట్టింది.

# ట్రంప్ మూడో ముచ్చట తీరేనా?

### అమెరికా రాజ్యాంగం అనుమతించేది రెండుసార్లే

### అయినా తనకు బోలెడు దారులున్నాయన్న అధ్యక్షుడు

### 2028లో అధ్యక్ష బరిలో వాన్స్ రన్నింగ్‌మేట్‌గా ట్రంప్

### నెగ్గాక వాన్స్ రాజీనామా, మూడోసారి పీఠంపై ట్రంప్

### ఆ ఆలోచన ఉందని ఇంటర్వ్యూలో చెప్పిన ట్రంప్

### సాధ్యాసాధ్యాలపై రాజ్యాంగ నిపుణుల అనుమానం

'మూడోసారి కూడా అధ్యక్షుడు కావాలనుకుంటున్నా. నేనేమీ జోక్ చేయడం లేదు. సీరియస్‌గానే చెప్తున్నా. నన్ను మూడోసారి కూడా అధ్యక్షునిగా చూడాలని అమెరికన్లలో చాలామంది కోరుకుంటున్నారు' %-% రెండోసారి అధ్యక్షుడై మూడు నెలలైనా నిండకముందే డొనాల్డ్ ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయి. మూడో టర్మ్ గురించిన ఆకాంక్షలను వెలిబుచ్చడం ఆయనకు ఇది తొలిసారేమీ కాదు. అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. అనంతరం గత జనవరిలో కూడా, 'ఒకట్రెండు సార్లు మాత్రమే కాదు, మూడు, ఇంకా చెప్పాలంటే నాలుగుసార్లు కూడా దేశానికి సేవ చేయడం నాకు అత్యంత గౌరవప్రదమైన విషయం'అని చెప్పుకొచ్చారు. రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టేందుకు అమెరికా రాజ్యాంగం అనుమతించదని తెలిసీ ట్రంప్ ఎందుకిలాంటి ప్రకటన చేశారన్నది ఆసక్తికరం. మనసుంటే మార్గముంటుందన్నట్టు, 'మూడో'ముచ్చట తీర్చుకునేందుకు ట్రంప్‌కు అవకాశముందని అభిమానులు చెబుతున్నారు. అందుకే అంత బాహాటంగా ఆ ప్రకటన చేశారంటున్నారు. అదెంతవరకు సాధ్యమన్న దానిపై జోరుగా చర్చ జరుగుతోంది. అంతేగాక ట్రంప్ యోచనకు అనుకూలంగా, వ్యతిరేకంగా కూడా పలు వాదనలు తెరపైకి వస్తున్నాయి. అవేమిటంటే...

### రాజ్యాంగాన్ని సవరించాలి

అమెరికా రాజ్యాంగానికి చేసిన 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టడానికి వీల్లేదు. అంతేకాదు. ఏ కారణాలతోనైనా రెండేళ్లు, అంతకంటే ఎక్కువకాలం అధ్యక్షునిగా చేసినా సరే, ఈ సవరణ ప్రకారం వారు మరొక్కసారి మాత్రమే తిరిగి ఎన్నిక కావచ్చు. ఈ లెక్కన ట్రంప్ కోరిక నెరవేరాలంటే రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. కానీ అది అత్యంత కష్టసాధ్యం. ఎందుకంటే ఆ సవరణను కాంగ్రెస్ ఉభయ సభలూ మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించాలి. ఆ మీదట మూడొంతుల రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆమోదముద్ర వేయాలి. కానీ అధికార రిపబ్లికన్లకు కాంగ్రెస్‌లో అంతా మెజారిటీ లేదు. పైగా 50 రాష్ట్రాల్లో 18 విపక్ష డెమొక్రాట్ల చేతుల్లోనే ఉన్నాయి. 'ఉపాధ్యక్ష'దారిలో... అధ్యక్ష పదవికి రెండుకంటే ఎక్కువసార్లు 'ఎన్నిక'కావడాన్ని మాత్రమే 22వ సవరణ నిషేధిస్తోంది. వారసత్వంగా ఆ పదవిని పొందే విషయంపై మాత్రం అందులో ఎలాంటి ప్రస్తావనా లేదు. దీన్ని ట్రంప్ తనకు అనుకూలంగా వాడుకోనున్నట్టు ఆయన మద్దతుదారులు చెబుతున్నారు! "ఏ కారణంతోనైనా అధ్యక్షుడు రాజీనామా చేస్తే నిబంధనల ప్రకారం ఆ పదవి ఉపాధ్యక్షునికే దక్కుతుంది. కనుక 2028లో ట్రంప్ ఉపాధ్యక్ష బరిలో దిగుతారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తారు. గెలిస్తే వెంటనే రాజీనామా చేస్తారు. తద్వారా ట్రంప్ ఆటోమేటిగ్గా మూడోసారి అధ్యక్షుడైపోతారు"అంటున్నారు. ఈ ఆలోచన తన మనసులో ఉందని ట్రంప్ అంగీకరించారు కూడా. కానీ దీనిపై భిన్న వాదనలున్నాయి. ఇది అసాధ్యమని యూనివర్సిటీ ఆఫ్ నోట్రెడామ్‌లో ఎన్నికల నిబంధనల నిపుణుడైన ప్రొఫెసర్ డెరెక్ ముల్లర్ చెబుతున్నారు. "అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు అర్హత లేని వ్యక్తి ఉపాధ్యక్ష పదవికి కూడా పోటీ పడేందుకు కూడా అనర్హుడేనని 12వ రాజ్యాంగ సవరణ స్పష్టం చేస్తోంది. 2028లో అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు ట్రంప్ అనర్హుడు గనుక ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు కూడా అనర్హుడే అవుతారు"అని ఆయన స్పష్టం చేశారు. ఇవన్నీ కాకుండా ఒకవ్యక్తి మూడుసార్లు అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు అనుమతిస్తూ రాజ్యాంగాన్ని సవరించాలని రిపబ్లికన్ నేత ఆండీ ఓగ్లెస్ గత జనవరిలో ప్రతిపాదించారు. అంతగా అయితే ఆ మూడుసార్లు వరుసగా కాకుంటే చాలంటూ ఓ నిబంధన విధిస్తే సరిపోతుందని సూచించారు.

### 9 మంది గెలవకుండానే అధ్యక్ష పీఠమెక్కారు

అమెరికా చరిత్రలో ఏకంగా 9 మంది ఉపాధ్యక్షులు ఎన్నికల పోరులో గెలవకుండానే అత్యున్నత పీఠమెక్కారు. అధ్యక్షుని మరణం, లేదా రాజీనామా వల్ల తాము అధ్యక్షులయ్యారు.

### వయసు అనుమతించేనా?

మూడోసారి అధ్యక్ష పదవి చేపట్టేందుకు వయసు కూడా ట్రంప్‌కు అడ్డంకిగానే మారేలా కన్పి స్తోంది. ఆయనకిప్పటికే 78 ఏళు ,, ఆ లెక్కన ఈ పదవీ కాలం ముగిసేసరికి 82 ఏళ్లకు చేరుకుంటారు. ఆ వయసులో తిరిగి ఎన్నికల బరిలో దిగాల్సి ఉంటుంది. అదెంత వరకు సాధ్యమన్నది కాలం గడిస్తే గానీ తేలదు.



### వద్దే వద్దు: డెమొక్రాట్లు

ట్రంప్ మూడో టర్మ్ వ్యాఖ్యలను విపక్ష డెమొక్రాటిక్ పార్టీ తీవ్రంగా ఖండించింది. "ఇటువంటి ఆలోచనలతో ప్రజాస్వామ్యానికి ఆయన మరింతగా తూట్లు పొడుస్తున్నారు. రెండోసారి అధ్యక్షుడైతేనే ప్రపంచమంతటినీ ఇంతటి గందరగోళంలోకి నెట్టేస్తున్న ఆయన మూడోసారి గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ వీల్లేదు. కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులకు రాజ్యాంగంపై ఏమాత్రం విశ్వాసమున్నా ట్రంప్ మతిలేని మూడో టర్మ్ ఆకాంక్షలను తక్షణం బాహాటంగా ఖండించాలి"అని డిమాండ్ చేసింది. రిపబ్లికన్లలో కూడా కొందరు మూడో టర్మ్ సరైన యోచన కాదంటున్నారు. ఈ ఆలోచనకు తానసలే మద్దతివ్వబోనని ఓక్లహామీ సెనేటర్ మార్క్వైన్ ములిన్ ఇటీవలే చెప్పారు.

### రూజ్‌వెల్ట్ నాలుగుసార్లు!

రెండు కంటే ఎక్కువసార్లు అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన ఏకైక నేతగా ఫ్రాంక్లిన్ డి.రూజ్‌వెల్ట్ నిలిచిపోయారు. 32వ అధ్యక్షునిగా 1933లో తొలిసారి గద్దెనెక్కిన ఆయన 1945లో మరణించేదాకా పదవిలోనే కొనసాగారు! అత్యధిక కాలం పాటు అధ్యక్షునిగా కొనసాగిన రికార్డు కూడా ఆయనదే. అధ్యక్ష పదవిని రెండుసార్లకు మించి చేపట్టరాదన్న సంప్రదాయాన్ని అమెరికా మొదటినుంచీ పాటిస్తోంది. దీనికి బాటలు వేసింది తొలి అధ్యక్షుడు జార్జి వాషింగ్టనే. ఆయన వరుసగా రెండుసార్లు గెలిచారు. మూడోసారీ అధ్యక్షుడు కావాలని దేశమంతా కోరినా సున్నితంగా నిరాకరించి తప్పుకున్నారు. అప్పటినుంచి అందరు అధ్యక్షులూ అనుసరిస్తూ వస్తున్న ఆ సంప్రదాయాన్ని రూజ్‌వెల్ట్ మాత్రం అతిక్రమించారు. రెండో ప్రపంచ యుద్ధాన్ని, హిట్లర్ సారథ్యంలో నాజీల దూకుడును బూచిగా చూపిస్తూ 1940, 1944 అధ్యక్ష ఎన్నికల్లో వరుసగా మరో రెండుసార్లు పోటీ చేసి గెలిచారు. అయితే 1944లో నాలుగోసారి బరిలో దిగేనాటికే రూజ్‌వెల్ట్ ఆరోగ్యం క్షీణించింది. 1945లో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మూడు నెలలకే మరణించారు. అనంతరం రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టకుండా 1951లో 22వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చింది.

# దుష్టసంస్కృతిపై కొరడా!

'భావప్రకటన స్వేచ్ఛను అణచివేయడం ఒకటి కాదు... రెండు తప్పులతో సమానం. ఎందుకంటే అది చెప్పేవారి హక్కుతోపాటు వినేవారి హక్కునూ ఉల్లంఘిస్తుంది' అంటాడు అమెరికా సంఘ సంస్కర్త, పౌరహక్కుల నేత ఫ్రెడరిక్ డగ్లస్. ఈ రెండింతల తప్పు చేయటం మన ప్రభుత్వాలు దిన చర్యగా మార్చుకున్నాయి. ఈ నేపథ్యంలో పౌరుల భావప్రకటన స్వేచ్ఛ అత్యంత కీలక మైనదని, వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయటం నాగరిక సమాజంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ధర్మాసనం మొన్న శుక్రవారం తేల్చిచెప్పింది. 'ఆ అభిప్రాయాలతో లేదా ఆలోచనలతో విభేదించవచ్చు. ఆ అభిప్రాయాలకు భిన్నంగా మరో అభిప్రాయాన్ని ప్రకటించటం ద్వారా దాన్ని ఎదుర్కొనాలి తప్ప అణిచేస్తామనటం రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే అవుతుంది' అని తెలియజేసింది. ఇన్‌స్టాలో, ఎక్స్‌లో గుజరాత్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ పెట్టిన కవిత వల్ల సమాజంలో విద్వేషాలు రగులుతాయని ఆరోపిస్తూ అక్కడి పోలీసులు కేసుపెట్టారు. దీన్ని తప్పుబడుతూ, కేసును కొట్టివేస్తూ ఇచ్చిన ఈ తీర్పు అనేక విధాల ఎన్నదగినది. రాజ్యాంగ విలువల పట్లా, పౌరుల హక్కులపట్లా వీసవెత్తు గౌరవం లేని అనైతిక పాలకులు ఇష్టా రాజ్యంగా రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టడం ఈమధ్య బాగా ముదిరింది. పాలకులు చెప్పిందే తడవుగా తప్పుడు కేసులు పెట్టే పోలీసులు కొందరైతే... వారి మెప్పు కోసం అనవసర ఉత్సాహాన్ని ప్రదర్శించే బాపతు మరికొందరు. ఆంధ్రప్రదేశ్ మొదలుకొని ఎక్కడ చూసినా ఇలాంటివారి హవా నడుస్తోంది. రాజ్యాంగాన్ని బేఖాతరు చేయటమంటే... దాని ప్రసక్తి లేకుండా పాలించాలనుకోవటమంటే హక్కులు లేని అధికారాన్ని చలాయించాలని చూడటమే. గుజరాత్ పోలీసులకు అభ్యంతరకరంగా అనిపించిన కవిత చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.అందులో ఒక మతాన్ని, వ్యవస్థనూ లేదా వ్యక్తిని కించపరిచింది లేదు. దేశద్రోహం పోకడలు రవ్వంతయినా లేవు. 'ఓ రక్త పిపాసులారా వినండి...' అంటూ మొదలయ్యే ఆ కవితలో అలాంటివారికి ప్రేమను పంచుతామన్న సందేశమే ఉంటుంది. అన్యాయానికి ఒడిగట్టినా దాన్ని న్యాయంతోనే ఎదుర్కొంటామంటుంది. ఇందులో పోలీసులకు ఏది అభ్యంతరమనిపించిందో గానీ... వెనకా ముందూ చూడకుండా కేసు పెట్టారు. విచారణ సందర్భంలో గుజరాత్ ప్రభుత్వం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'ఒక్కొక్కరు దీన్ని ఒక్కోవిధంగా విశ్లేషించుకుంటారు' అని పోలీసులను సమర్థిస్తుండగా సృజనాత్మకతను గౌరవించే సంస్కృతి లేకపోవటాన్ని ధర్మాసనం ఎత్తిచూపింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సైతం దాదాపు ఇదే స్వరంతో పోలీసులను తప్పు బట్టింది. రహదారుల బాగుకు నిధుల కోసం ఊరూరా టోల్‌గేట్లు పెడతామని ముఖ్యమంత్రి చంద్ర బాబు చేసిన ప్రకటనపై వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా రూపకం తయారుచేయడాన్ని నేరంగా పరిగ ణిస్తూ కేసు పెట్టడాన్ని నిలదీసింది. అవసరాన్నిబట్టి కేసులు పెట్టడం కాక, ఏదో ఒక కేసు పెట్టాలి, ఎవరో ఒకర్ని అరెస్టు చేయాలని చూడటం సరికాదని హెచ్చరించింది. ఇదొక్కటే కాదు... ఇలాంటి కేసులు కూటమి ప్రభుత్వం లెక్కకు మిక్కిలి బనాయిస్తోంది. ఈమధ్యకాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులనూ, కార్యకర్తలనూ అరెస్టు చేయని రోజంటూ లేదు. ఎప్పుడో మూడు నాలుగేళ్లక్రితం సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఏదో పోస్టు కారణంగా ఇప్పుడు మనోవ్యాధి పట్టుకుందని కూటమి లోని మూడు పార్టీల నాయకులూ పోలీస్‌స్టేషన్లకు పోతున్నారు. అధికారంలో ఊరేగుతున్నవాళ్లు ఫిర్యాదు చేసినంతమాత్రాన కేసులు పెట్టడం సబబా అన్న విచక్షణ కూడా పోలీసులకు ఉండటం లేదు. అధికారపక్షం కేసులు పెట్టడంలోని ఉద్దేశం, దాన్నుంచి ఆశిస్తున్న ప్రయోజనం వారికి తెలియందేమీ కాదు. అయినా ఈ నాటకం యథావిధిగా సాగిపోతోంది. అసమ్మతి గొంతు నొక్కడానికి నిరంతరం ప్రయత్నిస్తూనేవున్నారు. 'ఒక చిన్న కవిత వల్లనో, ఒక స్టాండప్ కామెడీ వల్లనో సమాజంలో భిన్న వర్గాల మధ్య విద్వేషాలు రగులుతాయని ఎలా అనుకుంటున్నారు...మన రాజ్యాంగ మౌలిక సిద్ధాంతాలు అంత బలహీనమైనవనుకుంటున్నారా?' అని సుప్రీంకోర్టు ధర్మాసనం గుజరాత్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. ఇదే మాదిరి సంస్కృతిని అమలు చేస్తున్న అన్ని ప్రభుత్వాలకూ ఈ ప్రశ్న చెంపపెట్టు. నిరంతరం అభద్రతాభావంతో బతు కీడ్చే వ్యక్తులనూ లేదా విమర్శ వల్ల తమ అధికారానికీ, పదవికీ ముప్పుకలుగుతుందనుకునే వారినీ ప్రమాణంగా తీసుకుని దేనిపైనా నిర్ణయానికి రావొద్దని ధర్మాసనం పోలీసులకు హితవు చెప్పింది. కింది స్థాయి కోర్టులు సక్రమంగా వ్యవహరించలేదని గమనించినప్పుడు దాన్ని సరిదిద్దాల్సిన హైకోర్టులు సైతం అదే బాటలో పోతుండటాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. రాజ్యాంగ ఆదర్శాలను ప్రభుత్వాలు అణిచివేయకుండా చూడటం రాజ్యాంగ న్యాయస్థానాలుగా హైకోర్టులతోపాటు సుప్రీంకోర్టు కర్తవ్యం. కానీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ కేసులో గుజరాత్ హైకోర్టు ఆ విషయంలో పూర్తిగా విఫలమైందన్నది సుప్రీం అభిప్రాయం. ఈమాదిరి కేసుల విషయంలో పోలీసులు ఎలా వ్యవహరించాలో ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. ఫిర్యాదు అందిందే తడవుగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయటం కాక, ముందు పోలీసు అధికారి ప్రాథమిక విచారణ జరపాలని ఆదేశించింది. సరైందను కుంటేనే కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఫిర్యాదీదారుకు ఆ సంగతి చెప్పాలని తెలిపింది. సుప్రీంకోర్టు తాజా తీర్పయినా అకారణంగా, అన్యాయంగా కేసులు బనాయించే పాలకుల దుష్ట సంస్కృతికి కళ్లెం వేయగలిగితే ప్రజాస్వామ్యం సురక్షితంగా మనుగడ సాగించగలుగుతుంది.

# సినిమా చిత్రం

## దేవకన్యలా.. మిత్రవిందగా..
## బేబీ లుక్కు అదిరింది..!



షార్ట్ ఫిలిమ్స్ తో కెరీర్ మొదలు పెట్టి ఆ తర్వాత సినిమాల్లో సైడ్ రోల్స్ చేస్తూ బేబీతో హీరోయిన్ గా సూపర్ హిట్ అందుకున్న భామ వైష్ణవి చైతన్య. అమ్మడు హీరోయిన్ గా నటించిన ఫస్ట్ సినిమానే సూపర్ హిట్ అందుకుంది. ఐతే సెకండ్ మూవీగా చేసిన లవ్ మీ సినిమా మాత్రం ఫెయిల్ అయ్యింది. అయినా సరే అమ్మడు ఏమాత్రం జోష్ తగ్గకుండా సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ తో జాక్ సినిమా చేస్తుంది వైష్ణవి చైతన్య. / ఆ సినిమాలో సిద్ధు తో మంచి రొమాంటిక్ ఎంటర్టైనర్ గా సినిమా చేస్తున్నట్టుగా ఉంది. బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్ లో వస్తున్న సినిమా కాబట్టి వైష్ణవి చైతన్య లక్కీగా ఫీల్ అవుతుంది. ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది వైష్ణవి చైతన్య. రకరకాల ఫోటో షూట్స్ తో ఫ్యాన్స్ ని మెప్పిస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు దేవకన్యగా మారి ఫోటో షూట్ చేసింది. పండగ వైబ్ ని మరింత పెంచేలా వైష్ణవి లుక్ ఉంది. ముఖ్యంగా ఒక మహారాణి లుక్ తో కనిపిస్తుంది వైష్ణవి చైతన్య. ఈ ఫోటోలు చూసిన చాలామంది మగధీరలో మిత్రవిందకు ఏమాత్రం తీసిపోదనేలా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. నిజమే అమ్మడి ఫోటో షూట్ ప్లానింగ్స్ ఎవరు ఇస్తున్నారో కానీ యువరాణి గెటప్ లో వైష్ణవి నిజంగానే దేవకన్యలానే కనిపిస్తుంది. జాక్ సినిమా హిట్







పడితే అమ్మడి కెరీర్ కు కాస్త బూస్టింగ్ వస్తుంది. ఐతే సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో హంగామా చేస్తుంది వైష్ణవి చైతన్య. సో అందుకే ఆమె ఫోటో షూట్స్ కి స్పెషల్ క్రేజ్ ఏర్పడుతుంది. అంతేకాదు తన టీం కూడా వైష్ణవిని సోషల్ మీడియాలో బాగా బూస్ట్ చేస్తుంది. తప్పకుండా వైష్ణవికి ఇదంతా కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. జాక్ సినిమా రిజల్ట్ ఏదైనా సరే వైష్ణవి తన ఫోటో షూట్స్ తో ప్రత్యేకమైన క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. అందుకే ఆమె ఇలా ఫోటోస్ షేర్ చేయగానే అలా వైరల్ అవుతున్నాయి. తెలుగు అమ్మాయికి ఇక్కడ మంచి అవకాశాలు వస్తే మరికొంతమంది సినిమాల్లోకి వచ్చే ఛాన్స్ ఉంటుంది. అందుకే వారిలో కాన్ఫిడెన్స్ నింపేందుకు వైష్ణవి తన కెరీర్ బిల్డ్ చేసుకుంటుంది.

## బాహుబలి స్కెచ్.. ఆర్.ఆర్.ఆర్ ఎగ్జిక్యూషన్..!



రాజమౌళి సినిమా సెట్స్ మీద ఉంది అంటే బ్యయట ఎన్ని ఊహాగానాలు జరుగుతాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన సినిమా మొదలు పెడుతున్నారు అనే న్యూసే సెన్సేషన్ అవుతుంది. ఇక సినిమా గురించి ప్రతి క్లూ ఫ్యాన్స్ కి పిచ్చెక్కించేలా చేస్తుంది. ప్రస్తుతం రాజమౌళి సూపర్ స్టార్ మహేష్ తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఎస్.ఎస్.ఎం.బి 29 సినిమాగా రాబోతున్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృధ్విరాజ్ సుకుమారన్ నటిస్తున్నారని తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మొన్నటిదాకా ఒడిశాలో జరిగింది. ఈమధ్యనే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూడా షూట్ చేసినట్టు తెలుస్తుంది. త్వరలో ఫారిన్ షూటింగ్ కి రెడీ అవుతున్న ఈ మూవీ నుంచి క్రేజీ అప్డేట్ ఒకటి ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. రాజమౌళి మహేష్ కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమా ఫారెస్ట్ అడ్వెంచర్ బ్యాక్ డ్రాప్ తో మైథాలజీ టచ్ కూడా ఉంటుందని టాక్. శ్రీ దుర్గ ఆర్ట్స్ బ్యానర్ లో 1000 కోట్ల భారీ బడ్జెట్ తో ఈ సినిమా చేస్తున్నారు. ఐతే బాహుబలి తరహాలో మహేష్ సినిమా కూడా రెండు భాగాలు చేసేలా జక్కన్న ప్లానింగ్ ఉందని అంతకుముందు వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు సడెన్ గా మహేష్ సినిమా రెండు భాగాలు కాదు ఒక భాగానికే ఫిక్స్ అవుతున్నారని తెలుస్తుంది. బాహుబలి స్కెచ్ తోనే ఎస్.ఎస్.ఎం.బి 29 తెరకెక్కిస్తున్నారని తెలుస్తుండగా స్కెచ్ బాహుబలి రేంజ్ లోనే ఉన్నా ఎగ్జిక్యూషన్ మాత్రం ఆర్.ఆర్.ఆర్ తరహాలో ఉంటుందని టాక్. అంటే సినిమా రెండు భాగాలు కాదు కాస్త లెంగ్త్ ఎక్కువ ఉన్నా ఒక భాగంగానే సినిమా పూర్తి చేస్తారని టాక్. అంతేకాదు సినిమా విషయంలో రాజమౌళి చాలా పెద్ద ప్లానింగ్ తోనే ఉన్నారని తెలుస్తుంది. సినిమాలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ కూడా ఎక్కువే ఉండేలా ఉన్నట్టు తెలుస్తుంది. 2027 లో సినిమా రిలీజ్ చేసేలా జక్కన్న ప్లాన్ చేస్తున్నాడు. ఐతే మహేష్ కూడా రాజమౌళి సినిమాకు పూర్తి డేట్స్ ఇచ్చాడు. ఈ సినిమాలో తన లుక్, స్టైల్ అన్నీ కూడా కొత్తగా ఉంటాయని తెలుస్తుంది. మరి రాజమౌళి మహేష్ ఎలాంటి సినిమాతో వస్తారో కానీ ఈ మూవీపై రోజు రోజుకి పెరిగిపోతున్న అంచనాలు చూస్తే బాబోయ్ అనిపించేస్తుంది. 1000 కోట్ల బొమ్మ అది కూడా రాజమౌళి నుంచి మన సూపర్ స్టార్ మహేష్ హీరోగా కాబట్టి కచ్చితంగా సినిమా నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది అన్నది చెప్పడంలో సందేహం లేదు. త్వరలోనే చిత్రయూనిట్ తో ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసేలా జక్కన్న ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది.






## 'ఎల్లమ్మ' కోసం వేణు బలగం ఫార్ములా

కమెడియన్‌గా మంచి పేరు తెచ్చుకున్నా ఆశించిన స్థాయిలో కమెడియన్‌గా గుర్తింపుని, సరైన అవకాశాల్ని వేణు దక్కించుకోలేకపోయాడు. అయితే నటుడిగా కన్నా - బలగం- సినిమాతో దర్శకుడిగా విశేషమైన గుర్తింపుతో పాటు ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసల్ని సొంతం చేసుకుని ప్రత్యేకతను చాటుకున్నాడు. ప్రియదర్శి, కావ్య కల్యాణ్‌రామ్, మురళీధర్‌గౌడ్ మినహా అంతా కొత్త వాళ్లతో వేణు తెరకెక్కించిన ఈ సినిమా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. వందకు పైగా ఇంటర్నేషనల్ అవార్డుల్ని దక్కించుకున్న ఈ సినిమాతో దర్శకుడిగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిన - బలగం - వేణు ఈ మూవీ తరువాత మళ్లీ ఎలాంటి కథతో వస్తాడా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న వేళ వేణు అందరిని సర్‌ప్రైజ్ చేస్తూ మరోసారి మట్టికథతో ఎల్లమ్మ - సినిమాని ప్రకటించడం తెలిసిందే. ముందు ఈ ప్రాజెక్ట్‌ని నేచురల్ స్టార్ నానితో చేయాలని ప్లాన్ చేశాడు. చర్చలు కూడా జరిగాయి. కానీ ఫైనల్‌గా ఈ ప్రాజెక్ట్ నుంచి నాని తప్పుకోవడంతో ఆ స్థానంలో నితిన్‌ని ఫైనల్ చేశారు.

దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మించడానికి రెడీ అవుతున్న ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు వేణు మళ్లీ -బలగం- ఫార్ములానే ఫాలోఅవుతున్నట్టుగా తెలుస్తోంది. -బలగం- సినిమా కోసం రంగస్థల కళాకారుల్ని తెరపైకి తీసుకొచ్చి శభాష్ అనిపించుకున్న వేణు -ఎల్లమ్మ - సినిమా కోసం కూడా ఇదే పంథాని అనుసరిస్తున్నట్టుగా తెలిసింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ స్టేజ్‌లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం బలగం వేణు రంగస్థల కళాకారుల కోసం వేట మొదలుపెట్టినట్టుగా తెలిసిది. ఇప్పటికే తెలంగాణలోని పల్లెల్లో, నగరాల్లో పర్యటిస్తున్న వేణు సిరిసిల్ల,సి నిజామాబాద్‌లలోనూ పర్యటించాడట. ఇప్పటికే పలువురు రంగస్థల కళాకారుల్ని ఎంపిక చేసినట్టుగా తెలిసింది. వీరిని ప్రత్యేకంగా స్టేజ్ డ్రామాలు, వారి నటనను పరిశీలించాకే వేణు ఎంపిక చేసినట్టుగా చెబుతున్నారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కాబోతోంది. రంగస్థల కళాకారులని తీసుకుని - బలగం-తో మ్యాజిక్ చేసిన వేణు మళ్లీ అదే ఫార్ములాతో -ఎల్లమ్మ - తోనూ అదే మ్యాజిక్‌ని రిపీట్ చేస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.



## శ్రీవిష్ణు సింగిల్.. కలర్ఫుల్ మెలోడిగా 'శిల్పి ఎవరో' 'సింగిల్'

టాలీవుడ్ ఇండస్ట్రీలో డిఫరెంట్ కంటెంట్ సినిమాలతో ప్రయోగాలు చేసే అతికొద్ది మంది హీరోలలో శ్రీవిష్ణు ఒకరు. ఇప్పుడు మరోసారి ప్రేమ కథలో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యాడు. 'చసింగిల్' అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమా ఓ డిఫరెంట్ ట్రయాంగిల్ లవ్ స్టోరీగా ఉండనుందని తెలుస్తోంది. ప్రేమకు దూరంగా ఉండమంటూ చెప్పే వ్యక్తి చివరికి ప్రేమలో పడతాడా..? అనే ఆసక్తికరమైన కథతో తెరకెక్కుతోంది ఈ సినిమా. కార్తిక్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కథానాయికలుగా కేతికా శర్మ, ఇవానా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరీలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే పోస్టర్లతో అందర్నీ ఆకట్టుకున్న ఈ సినిమా నుంచి తాజాగా 'శిల్పి ఎవరో' అనే లిరికల్ మెలోడీ పాట విడుదలైంది. విశాల్ చంద్రశేఖర్ అందించిన ఈ మెలోడీగా హార్ట్ ను టచ్ చేసేలా ఉంది. యాజిన్ నజీర్ ఆలపించిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించారు. వయలిన్ వాయిద్యం ప్రధానంగా వినిపించే ఈ పాట ఓ శాంతమైన ప్రేమ స్పర్శను కలిగిస్తుంది. పాటలో వినిపించే సంగీతం, మాటలు ప్రేమలో కొత్త హాయిని తీసుకొస్తున్నాయి. శ్రీ విష్ణు పాటలో తన నటనతో, చూపులోనూ కనిపించే నిజమైన ప్రేమతో ఆకట్టుకుంటున్నాడు. కథానాయికలతో అతని కెమిస్ట్రీ చక్కగా వర్కౌట్ అయ్యింది. కేతికా శర్మ, ఇవానా ఇద్దరూ కలర్‌ఫుల్ వేషధారణతో పాటకు అందాన్ని తక్కువేంటి.. పెంచేశారు. స్టెప్స్, లోకేషన్లు, లైటింగ్ అన్నీ ఈ మెలోడీకి ఒక మంచి ఫీల్ ను తీసుకు వచ్చాయి. ప్రస్తుతం ఈ పాటను నెట్‌లో చూసినవారు పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ తనదైన మ్యూజిక్ టచ్‌ను చూపించాడనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. పాటకు వచ్చిన రెస్పాసినిమా మీద ఉన్న అంచనాలు మరింత పెరిగేలా న్స్ చూస్తుంటే, కనిపిస్తున్నాయి. మొత్తానికి 'శిల్పి ఎవరో' పాట 'సింగిల్' సినిమాకు సరైన లాంచ్‌గా నిలిచింది. మెలోడీ ప్రేమికుల మనసులు దోచే ఈ పాట... కథలోని ఎమోషన్‌ను ఎలివేట్ చేయగలదనే నమ్మకం మేకర్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. మే 9న సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఈ పాట మరింత హైప్‌ను తీసుకొస్తోంది. మరి ఈ పాట ఆకట్టుకున్నట్లే సినిమా కూడా ఆ స్థాయిలో అలరించగలు గుతుందేమో చూడాలి.




## మల్టీస్టారర్ స్పోర్ట్స్ డ్రామా వచ్చేసింది చూశారా..!



భాష ఏదైనా మల్టీ స్టారర్ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. స్క్రీన్ పై ఒక్క హీరోను లేదా హీరోయిన్‌ను చూస్తేనే ప్రేక్షకులు కేరింతలు కొడతారు. అలాంటిది ఇద్దరు పెద్ద హీరోలు ఒకే సినిమాలో కనిపిస్తే కచ్చితంగా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు అనడంలో సందేహం లేదు. అందుకే అన్ని భాషల్లోనూ మల్టీ స్టారర్ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. హీరోల స్టార్‌డం, క్రేజ్‌ను బట్టి ఆయా మల్టీస్టారర్ సినిమాల క్రేజ్ పెరుగుతూ ఉంటుంది. తాజాగా తమిళ్‌లో సీనియర్ స్టార్ హీరోలు మాధవన్, సిద్దార్థ్‌లు కలిసి నటించిన 'టెస్ట్' పై అందరి దృష్టి ఉంది. ఈ సినిమాలో హీరోయిన్స్‌గా నయనతార, మీరా జాస్మిన్ నటించడం విశేషం. ఈ అరుదైన కలయికలో రూపొందిన 'టెస్ట్' ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. ఎస్ శశికాంత్ దర్శకత్వంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామాపై మొదటి నుంచి తమిళ ప్రేక్షకుల్లో అంచనాలు, ఆసక్తి నెలకొంది. సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేయాలని భావించినప్పటికీ కొన్ని కారణాల వల్ల సాధ్యం కాలేదు. భారీ అంచనాల నడుమ రూపొందిన ఈ సినిమాను థియేట్రికల్ రిలీజ్ స్కిప్ చేసి నేరుగా ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. ప్రముఖ ఓటీటీ నెట్ ఫ్లిక్స్ ఈ భారీ మల్టీస్టారర్ స్పోర్ట్స్ డ్రామాను స్ట్రీమింగ్ చేసింది. సినిమాలో క్రికెట్‌కు సంబంధించిన సన్నివేశాలు క్రికెట్ అభిమానులను అలరిస్తాయని రివ్యూలు వస్తున్నాయి. నయనతార నటించిన సినిమా కావడంతో ఆమె ఫ్యాన్స్ సైతం ఓటీటీ ముందు క్యూ కట్టారు. చెన్నైలో జరిగిన ఒక ఇంటర్నేషనల్ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ ముగ్గురు జీవితాలను ఎలాంటి మలుపులు తిప్పింది, ఆ ఆటకి ఆ ముగ్గురికి సంబంధం ఏంటి అనే విషయాలను ఆసక్తికర స్క్రీన్‌ప్లేతో దర్శకుడు శశికాంత్ నడిపిన తీరు బాగుందని కొందరు కామెంట్ చేస్తున్నారు. లేడీ సూపర్ స్టార్ ట్యాగ్ దక్కించుకున్న నయనతార ఈ సినిమాలో నటించడంతో పాటు మాధవన్, సిద్దార్థ్ వంటి ఒకప్పటి స్టార్స్ నటించడంతో టెస్ట్ సినిమా స్థాయి అమాంతం పెరిగింది. ఈ సినిమా డైరెక్ట్ ఓటీటీ స్ట్రీమింగ్ అంటూ ప్రకటించినప్పటి నుంచి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూశారు. వైనాట్ స్టూడియోస్ బ్యానర్‌పై చక్రవర్తి రామచంద్ర, శశికాంత్ నిర్మించిన ఈ సినిమాలో నాజర్, కాళి వెంకట్, వినయ్ వర్మలు కీలక పాత్రలో నటించారు. శక్తి శ్రీ గోపాలన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించాడు. నయనతార గతంలో నటించిన కొన్ని సినిమాలు కూడా థియేట్రికల్ రిలీజ్ ను స్కిప్ చేసుకుని డైరెక్ట్ ఓటీటీ స్ట్రీమింగ్ అయిన విషయం తెల్సిందే. ఆ సినిమాలకు మంచి స్పందన వచ్చిన నేపథ్యంలో ఈ సినిమాకు సెంటిమెంట్ వర్కౌట్ అయి మంచి స్పందన వస్తుందని అంతా భావించారు. తమిళ్‌తో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్ చేస్తోంది. మరి ఈ మల్టీస్టారర్ స్పోర్ట్స్ డ్రామాను నెట్‌ఫ్లిక్స్‌లో మీరు చూశారా? లేదా చూడబోతున్నారా?